



కారడవిలో కృషీవలురు 6లో

నామినేటెడ్ కోసం ప్రదక్షిణలు



మలి విడత నామినేటెడ్ పోస్టుల కోసం పట్టు

అమరావతి కేంద్రంగా టీడీపీ-జనసేన నేతల పైరవీలు

తమ పరిస్థితేంటని వేడుకోలు..

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నామినేటెడ్ పదవుల కోసం నాయకులు పైరవీలు చేస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన కూటమి నాయకులు మలివిడత నామినేటెడ్ పోస్టుల భర్తీలో స్థానం సంపాదించుకునేందుకు విపరీతంగా ప్రయత్నాలు చేస్తున్నారు. వివిధ పార్టీల నేతలతో కలిసి అమరావతి వెళ్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో పాటు పలువురు నేతలను కలిసి తమ రాజకీయ భవిష్యత్తు కోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.



(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

దీనిలో భాగంగా జిల్లా నుంచి జనసేన, టీడీపీ, బీజేపీలకు చెందిన నేతలు ఎవరి రూట్‌లో వారు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇప్పటికే తొలి విడత నామినేటెడ్ పోస్టుల భర్తీలో నలుగురిని మాత్రమే వివిధ డైరెక్టర్ల పోస్టులు వరించాయి. వారిలో మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి, అధికార ప్రతినిధి మోకా ఆనంద్‌సాగర్, మత్స్యకార నేత నాగిడి నాగేశ్వరరావు, జనసేనకు చెందిన గుండుబోగుల పెద్దకాపులకు డైరెక్టర్ పదవులు లభించాయి. అయితే ఎన్నికల సమయంలో కీలకంగా పనిచేసిన టీడీపీ, జనసేన నేతలు ఈసారి రెండోవిడత జాబితాలో తమకు అవకాశం కల్పించాల్సిందేనంటూ ఆయా అధిష్టానాలపై తీవ్రమైన ఒత్తిడి పెంచారు. దీనిలో భాగంగా టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్సీ, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యంకు ఈసారి నామినేటెడ్ పోస్టుల భర్తీలో అవకాశం లభించవచ్చునని ప్రచారం జరుగుతోంది. వీరితో పాటు టీడీపీకి చెందిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్ల రమణబాబు, పెచ్చెట్టి చంద్రమౌళిలతో పాటు మరికొందరు పేర్లు పరిశీలన కోసం పార్టీ అధిష్టానం తీసుకున్నట్టు సమాచారం. అదే విధంగా జనసేన నుంచి నియోజకవర్గ స్థాయి కన్వీనర్ హోదాలో ఉన్న బండారు శ్రీనివాసరావు, వేగుళ్ల లీలాకృష్ణతో పాటు మరికొందరు కీలక నేతలు పేర్లను పార్టీ అధిష్టానానికి సిఫార్సు చేసినట్టు తెలుస్తుంది. కోనసీమలో కుడా(కోనసీమ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) చైర్మన్ పదవి కోసం టీడీపీ నేతలు గట్టి ప్రయత్నమే చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. వీటితో పాటు జిల్లాలో ఉన్న కీలక దేవస్థానాలకు చైర్మన్ల కోసం ఆయా గ్రామాలకు చెందిన నేతలు పార్టీ అధినేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కోనసీమ జిల్లా నుంచి కీలకమైన పదవులేవీ నేతలకు దక్కకపోవడంతో వివిధ సామాజిక వర్గాలకు చెందిన నాయకులు ఇప్పటికే అసంతృప్తి చెందుతున్నారు. జిల్లాను పట్టించుకోవడం లేదంటూ మరికొందరు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తూ అధిష్టానాలపై నిప్పులు చెరుగుతున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో జనసేన కూడా నామినేటెడ్ పోస్టులపై దృష్టిపెట్టి కీలక వ్యక్తులకు అవకాశాలు కల్పించాలని నాయకులు కోరారు.

పిల్లల సంరక్షణ కేంద్రాలకు

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

అమలాపురం టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పిల్లల సంరక్షణ, రక్షణ చట్టం నిబంధనలకు లోబడి బాలల సంరక్షణా కేంద్రాలు నిర్వహించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పర్యవేక్షణాధికారి ఎల్.ఆదిసాయిలక్ష్మీమణి, జిల్లా బాలల సంరక్షణాధికారిణి ఉమాలక్ష్మి విజ్ఞప్తి చేశారు. బాలల సంరక్షణా కేంద్రాలు నిర్వహిస్తున్నవారు జువైనల్ జస్టిస్ నిబంధనలతో పాటు మరికొన్ని చట్టాలను పాటించి సంరక్షణ కేంద్రాలన్నీ లైసెన్సులు తీసుకోవాలని కోరారు. జువైనల్ జస్టిస్ పిల్లల సంరక్షణ చట్టం 2015లోని సెక్షన్ 41 ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే గత నెల 22వ తేదీన బాలల సంక్షేమ, సంస్కరణ సేవల శాఖ సంచాలకులు నోటిఫికేషన్ జారీ చేసినట్టు తెలిపారు. వాటిలోని నిబంధనల ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలనుకున్నవారు నిర్దేశిత ఫార్మెట్‌లో దరఖాస్తులను విజయవాడ బాలల సంరక్షణ సంక్షేమశాఖ కార్యాలయానికి పంపించాలని కోరారు. ఇతర వివరాలను వెబ్‌సైట్‌లో పరిశీలించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

---

12 ఇసుక రీచ్‌లకు 59 దరఖాస్తులు



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

పారదర్శకంగా మూల్యాంకనం

ముందుగా టెక్నికల్ బిడ్‌ల పరిశీలన

అనంతరం అర్హతను బట్టి ఫైనాన్సియల్ బిడ్‌లను తెరుస్తాం

మూల్యాంకన కమిటీ సమావేశంలో కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 12 ఇసుక రీచ్‌లకు గాను 59 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ముందుగా టెక్నికల్ బిడ్‌లను మూల్యాంకనం చేయనున్నట్లు చెప్పారు. టెక్నికల్ బిడ్‌లలో పారామీటర్లను పరిశీలించి అర్హత సాధించినవారు ఫైనాన్షియల్ బిడ్‌లను తెరుస్తామన్నారు. బిడ్‌ల మూల్యాంకన కమిటీ 59 దరఖాస్తులకు సంబంధించి టెక్నికల్ పారామీటర్లను క్షుణ్ణంగా పరిశీలించి సాంకేతికంగా అర్హత సాధించిన వారి జాబితాను ఈ నెల 12నాటికి సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇసుక రీచ్‌ల్లో ఇసుకను మాన్యువల్‌గా తవ్వడం, లోడింగ్, నిల్వ కేంద్రం వద్దకు రవాణా, వాహనాల్లో ఇసుకను లోడ్ చేయడానికి ఆహ్వానించిన సీల్డు టెండర్ల టెక్నికల్ బిడ్‌లను పూర్తి పారదర్శకతతో మూల్యాంకనం చేయాలని ఏడుగురు కమిటీ సభ్యులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం మూల్యాంకన కమిటీ సభ్యులతో ఆయన సమావేశమై దిశానిర్దేశం చేశారు. జిల్లాలో ఆత్రేయపురం మండలం అంకంపాలెం, నార్కేడుమిల్లి, పులిదిండి, వద్దిపర్రు-1, 2, ఆత్రేయపురం, రావులపాలెం మండలంలో పొడగట్లపల్లి-1, 2, ఊబలంక, ఆలమూరు మండలంలో ఆలమూరు, కపిలేశ్వర మండలంలో కపిలేశ్వరపురం, తాతపూడి ఇసుక రీచ్‌లలో 2025 మార్చి 14 వరకు ఇసుక తవ్వకానికి టెండర్లను ఆహ్వానించామన్నారు. టెండర్లు వేసినవారు గడిచిన మూడు సంవత్సరాల్లో రూ.3 కోట్ల మేర టర్నోవర్ చేశారా లేదా గతంలో మైనింగ్ సివిల్ వర్కులు చేశారా లేదా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా బిడ్డర్లు బ్లాక్ లిస్టులో ఉన్నారా లేరా, మైన్స్‌శాఖకు, మినరల్, రెవెన్యూ బకాయిలు లేకుండా ఉన్నారా లేరా పరిశీలన చేయాలన్నారు. సంబంధిత డాక్యుమెంట్లు సమర్పించారో లేదో చూడాలన్నారు. సాంకేతికంగా అర్హత సాధించినవారి ఫైనాన్షియల్ బిడ్‌లను ఈ నెల 12న ఓపెన్‌చేసి అతి తక్కువ కోట్ చేసిన వారికి రీచ్‌ల నిర్వహణకు అనుమతులు ఇస్తామన్నారు. సమావేశం అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్ దరఖాస్తుదారుల సమక్షంలో టెండరు డాక్యుమెంట్లు ఉన్న బాక్సును ఓపెన్‌చేసి టెక్నికల్ బిడ్‌లను పరిశీలించాలని అధికారులకు సూచించారు. అసిస్టెంట్ జియాలజిస్టు ఎల్.వంశీధర్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, జిల్లా ఆడిట్ అధికారి ఏవీవీ సత్యనారాయణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ పి.శివరామకృష్ణ, అంబాజీపేట సబ్ రిజిస్ట్రార్ యు.జగన్మోహనరావు, ఆర్‌అండ్‌బీ డీఈ బీవీఎస్ వర్మ, ఇరిగేషన్ డీఈ ఆర్.నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.



దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్

నేడు స్కూళ్లకు వర్కింగ్ డే

ముమ్మిడివరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రెండో శనివారం 9వ తేదీ జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు పనిచేయాల్సిందిగా డీఈవో షేక్ సలీంబాషా సూచించారు. ఈ మేరకు డీవైఈవోలు, ఎంఈవోలు అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. గత నెలలో తుఫాన్, భారీ వర్షాల కారణంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలలకు సెలవులు ఇచ్చారని, ఆ సెలవులకు కాంపెన్సటరీగా రెండో శనివారం వర్కింగ్ డేగా ప్రకటించామని పాఠశాలలు పనిచేయాలన్నారు.

'సెలవు ప్రకటించాలి'

అమలాపురం టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రెండో శనివారం యథాతథంగా సెలవు ప్రకటించాలని ప్యాప్టో జిల్లాశాఖ నాయకుల బృందం శుక్రవారం కలెక్టరేట్‌లో పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావుకు వినతిపత్రం అందజేసింది. రెండో శనివారం సెలవు దినం అయినప్పటికీ డీఈవో పాఠశాలలు పనిచేయాలని మౌఖిక ఉత్తర్వులు ఇచ్చారని పేర్కొన్నారు. ఏడాదికి 220 పనిదినాలు సరిపోతున్నందున యథావిధిగా సెలవు ప్రకటించాలన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు, ప్యాప్టో నాయకులు పీవీఎస్ రామారావు పాల్గొన్నారు.

త్వరితగతిన వంతెన అందుబాటులోకి రావాలి



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సహకరిస్తుంది

జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

పి.గన్నవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గంటిపెదపూడి, ఉడిమూడి లంక గ్రామాలకు వశిష్ట నదీపాయపై నిర్మించే వంతెనను నిర్ణీత గడువులో పూర్తిచేసి లంక గ్రామాలకు అందించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. గంటిపెదపూడిలో ఏఐబీ నిధులు రూ.49.50 కోట్లతో నిర్మించే వంతెన పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సహకరిస్తుందని వంతెన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. తొలుత ఉడిమూడి సమీపంలో ప్రధాన పంటకాల్వపై నిర్మిస్తున్న రెండు వరుసల వంతెనను పరిశీలించారు. అనంతరం గంటి పెదపూడి చేరుకుని ఏటిగట్టు దిగువన జరుగుతున్న వంతెన పనులను పరిశీలించగా వంతెన డిజైన్‌ను పంచాయతీరాజ్ ఈఈ పి.రామకృష్ణారెడ్డి, ప్రాజెక్టు డీఈ అన్యం రాంబాబు కలెక్టర్‌కు వివరించారు. ఇటీవల వచ్చిన వరదలకు నీట మునిగిన వంతెన పరిసరాలను ఫ్లెక్సీపై ఏర్పాటు చేసి అప్పటి పరిస్థితులను అధికారులు, కాంట్రాక్టర్లు కలెక్టర్‌కు వివరించారు. అదే విధంగా ఏటిగట్టు దిగువన ఏర్పాటు చేస్తున్న అప్రోచ్‌కు ఎంతమేర మట్టి అవసరమవుతుందని కలెక్టర్ అధికారులను ఆరా తీయగా ఇంకా 25 వేల క్యూబిక్ మీటర్ల మట్టి అవసరమవుతుందని చెప్పారు. అదే విధంగా 10 స్పాన్‌లు ఉంటా యని ఒక్కొక్కటి 34.2 మీటర్ల పొడవు, 7.5 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్నామని ప్రాజెక్టు డీఈ మ్యాప్‌తో వివరించారు. ఇప్పటి వరకు 40 శాతం పనులు పూర్తయ్యాయని రూ.21 కోట్లకు సంబంధించి బిల్లులు ప్రభుత్వానికి పంపించామని కలెక్టర్‌కు వివరించారు.

నష్టపరిహారం చెల్లించండి..

కలెక్టర్‌ను కోరిన రైతులు

వంతెన పనుల్లో భాగంగా ఏటిగట్టు దిగువన ఏర్పాటు చేస్తున్న అప్రోచ్ నిర్మాణానికి సంబంధించి సేకరించిన వ్యవసాయ భూముల రైతులు నష్టపరిహారం చెల్లించాలని కలెక్టర్‌ను కోరారు. గతేడాది చివరిలో వంతెన పనులు ప్రారంభించారని ఇప్పటి వరకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించలేదని కలెక్టర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన కలెక్టర్ రైతుల వివరాలను పంపాలని అధికారులను ఆదేశించారు. కాగా జిరాయితీ భూములు 4.02 ఎకరాలు భూమికి సంబంధించి 8 మంది రైతులకు, పట్టా భూమి 95 సెంట్లు సంబంధించి నలుగురు రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన రేటు ప్రకారం నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది. కలెక్టర్ వెంట పంచాయతీరాజ్ ఈఈ పి.రామకృష్ణారెడ్డి, తహశీల్దార్ పి.శ్రీపల్లవి, ఎంపీడీవో కేవీ ప్రసాద్, డీఈ అన్యం రాంబాబు, జేఈ బి.కొండలరావు, ఆర్ఐ వర్మ, వీఆర్వో భగవాన్ ఉన్నారు.

ఆర్టీసీలో పదివేల పోస్టులు ఖాళీ

నోటిఫికేషన్ విడుదల చేసి ఖాళీలను భర్తీ చేయాలి

ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు



మాట్లాడుతున్న దామోదరరావు

అమలాపురం రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిత్యం 40 లక్షల మందికిపైగా రవాణా సౌకర్యాన్ని అందిస్తున్న ఏపీఎస్ ఆర్టీసీలో అన్ని కేటగిరీల్లోను సుమారు పదివేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఏపీపీటీడీ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఖాళీల భర్తీకి అనుమతి ఇవ్వకపోవడంతో ప్రస్తుతం అన్ని కేటగిరీల్లో పదివేలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆర్టీసీలో పోస్టుల భర్తీకి ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అమలాపురం ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏపీపీటీడీ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నిర్మాణ మహాసభ రావుల సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు మాట్లాడుతూ ఆర్టీసీలో రాత్రిపగలు భేదం లేకుండా పనిచేస్తున్న ఉద్యోగులకు విలీనం అనంతరం ఈహెచ్‌ఎస్ ప్రయోజనకరంగా లేకుండా పోయిందన్నారు. విలీనానికి ముందు ఉన్న పాత పద్ధతిలోనే రిఫరల్ ఆసుపత్రుల ద్వారా విశ్రాంత ఉద్యోగులతో సహా అందరికీ వైద్య సౌకర్యాలు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో మహిళలకు ఉచిత రవాణా సౌకర్యాన్ని అందిస్తామని ఇచ్చిన హామీ అమలు కావాలంటే ప్రస్తుతం ఉన్న బస్సుల సంఖ్య సరిపోదన్నారు. ఇప్పుడు కొత్తగా వస్తున్న బస్సులే కాకుండా అదనంగా 2వేల బస్సులు పెంచాల్సి ఉంటుందన్నారు. ఈయూ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎండీ ప్రసాద్ మాట్లాడుతూ పదోన్నతులకు సంబంధించి అనుమతుల్లో ప్రభుత్వం జాప్యం చేస్తున్నందున సుమారు 3వేల మందికి 2022 నుంచి పదోన్నతులు నిలిచిపోయాయన్నారు. వెంటనే ప్రభుత్వం పదోన్నతులకు అనుమతులు ఇవ్వాలన్నారు. ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించేలా గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఇచ్చిన సర్క్యులర్ నంబరు 1/2019ని యథావిధిగా అమలు చేయాలన్నారు. జీవో నంబరు 114ను అనుసరించి అలవెన్సులు చెల్లించాలన్నారు.

ఈయూ జిల్లాశాఖ నూతన కార్యవర్గం..

ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ కోనసీమ జిల్లాశాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాశాఖ గౌరవాధ్యక్షునిగా రావుల సుబ్బారావు (రావులపాలెం), జిల్లా అధ్యక్షుడిగా పి.సత్తిబాబు (రామచంద్రపురం), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎండీ రజాక్ (అమలాపురం), కార్యదర్శిగా మేడిది శ్రీనివాసరావు (అమలాపురం)తో పాటు ఎనిమిది మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయవాడ జోన్-2 జోనల్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కొప్పుల సత్తిబాబు, జోనల్ సభ్యులు కేవీవీఎస్ నారాయణ, జి.చిరంజీవి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలపై జరిగే అరాచకాలను అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్టుమెంట్ అదనపు ఎస్పీ అస్మఫర్హీన్

క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్టుమెంట్ అదనపు ఎస్పీ అస్మఫర్హీన్

అమలాపురం టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలపై జరిగే అరాచకాలను అరికట్టేందుకు సమష్టిగా కృషి చేయాలని క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్టుమెంట్ అదనపు ఎస్పీ అస్మఫర్హీన్ పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో అరెస్టులు జరిగినప్పటికీ కోర్టుల్లో ట్రయల్ సమయంలో సాక్ష్యం సరిగా చెప్పకపోవడం వల్ల ఆయా కేసుల్లో శిక్షలు పడడం లేదన్నారు. ట్రయల్ సమయంలో బాధితులు, సాక్షులు కోర్టుకు వచ్చి సాక్ష్యం సరిగ్గా చెప్పాలని కోరారు. సీఐడీ అడిషనల్ డీజీపీ రవిశంకర్ ఐఎన్నార్ ఆదేశాల మేరకు అస్మఫర్హీన్ ఆధ్వర్యంలో శుక్రవారం అమలాపురం గంగరాజు ఫంక్షన్‌హాలులో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ అట్రాసిటీ చట్టంపై ప్రతిఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. అసమానతలు, హక్కుల ఉల్లంఘన గురించి తెలుసుకోవాలని వివరించారు. విశ్రాంత పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.గోపాలరావు అట్రాసిటీ చట్టంలోని పలు అంశాలపై సుదీర్ఘంగా ప్రసంగించారు. అంటరానితనం నిర్మూలన, ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్, అట్రాసిటీ యాక్టులోని అనేక అంశాలను ఆయన వివరించారు. తహశీల్దార్ కిశోర్ అట్రాసిటీ బాధితులకు అందిస్తున్న పరిహారాల గురించి తెలియచేశారు. డీబీఎంఎస్ జాతీయ కన్వీనర్ కొంకి రాజామణి మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు పరిహారాల పంపిణీలో జాప్యం జరగడానికి గల కారణాలు, జస్టిస్ పున్నయ్య కమిషన్ సూచించిన ముఖ్య విషయాలను సూచించారు. అట్రాసిటీ చట్టంపై ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించి విజేతలకు అదనపు ఎస్పీ అస్మఫర్హీన్ బహుమతులు, షీల్డులు అందజేశారు. సీఐడీ డీఎస్పీ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ కె.హేమలత, నాయకులు, పుణ్యమంతుల రజనీ, జంగా బాబూరావు, పొలమూరి మోహన్‌బాబు, ఇసుకపట్ల రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణాలకు గ్రీన్‌సిగ్నల్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణాలకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. 14 రోడ్లు 101 కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లు సంసిద్ధత వ్యక్తం చేశారు. దీంతో గత ప్రభుత్వంలో నిలిచిపోయిన పనులు పూర్తికానున్నాయి. రోడ్ల నిర్మాణానికి రెండేళ్ల కిందట వైసీపీ ప్రభుత్వంలో టెండర్లు పిలిచి పనులు ఖరారు చేశారు. దీనికి రూ.290 కోట్లు నిధులు కేటాయించారు. అయితే పనులు ప్రారంభించిన తర్వాత చేసిన వాటికి బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్లు మధ్యలోనే పనులు నిలుపుదల చేశారు. దీంతో రెండేళ్లుగా రోడ్లు అధ్వానంగానే ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.30 కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించారు. మరో రూ.8 కోట్ల బిల్లులు చెల్లింపు దశలో ఉన్నాయి. వారంలో చెల్లించే అవకాశం ఉంది. మిగిలిన రూ.242 కోట్ల కూడా విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో మళ్లీ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు వస్తున్నారు.

14 రోడ్లు ఇవే

జి.వేమవరం-గొర్రిపూడిరోడ్డు, కరప-ఇంద్రపాలెం-దోమాడరోడ్డు, గొల్లపాలెం-కుయ్యేరురోడ్డు, మురమళ్ల-వెదుర్లంక-పోలవరంరోడ్డు, ముమ్మిడివరం-కాట్రేనికోనరోడ్డు, ముమ్మిడివరం-ముక్తేశ్వరంరోడ్డు, విశ్వేశ్వరాయపురం-దిండిరోడ్డు, చింతలపూడి బ్రిడ్జి-మల్కిపురం రోడ్డు, రాజమండ్రి-గోకవరం-ముగ్గళ్లరోడ్డు, రాజానగరం- వెస్ట్ గోనగూడెం రోడ్డు, రాపాడు- చినకొండేపూడి రోడ్డు, రేపాక- చిన కొండేపూడి రోడ్డు, రాజుపాలెం- రామవరం రోడ్డు, ఏలేశ్వరం-జడ్డంగి రోడ్లు ఉన్నాయి. వీటిని నిర్మాణాలు జరగనున్నాయి.

ప్రభుత్వ హామీతో సంసిద్ధత

అమరావతిలో గురువారం జరిగిన ఉన్నతాధికారుల సమావేశంలో ప్రభుత్వ హామీతో కాంట్రాక్టర్లు ముందుకు వచ్చారు. మెటీరియల్ రేట్ల పెరగడం వల్ల ప్రస్తుతం ఉన్న రేట్ల ప్రకారం బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు కోరగా పరిశీలిస్తామని ఉన్నతాధికారులు చెప్పినట్టు సమాచారం.

విహార యాత్రలో విషాదం

సోకిలేరు వాగులో మునిగి ఇరుసుమండ యువకుడి మృతి 7లో

కూటి కోసం వెళ్లి కానరాని లోకాలకు..

ఏలేరు వాగులో మునిగి ఇద్దరు మృతి..మరో ఇద్దరు గల్లంతు 7లో



వరి పంట

కారడవిలో.. కృషీవలురు

- చింతూరు, ఆంధ్రజ్యోతి



నువ్వుల సాగు



చెరువు నిర్మాణ పనులకు కలసికట్టుగా వెళుతున్న ఆదివాసీ మహిళలు

కష్టాలకు ఎదురొడ్డి నిలిచారు. చెట్ల నీడనే ఆవాసాలుగా మలచుకున్నారు. బురద నీటితో గొంతు తడుపుకున్నారు. కడుపు నింపుకోడానికి కట్టెల సేకరణే ఉపాధిగా మలచుకున్నారు. ఆకలి మంటను నూకల జావతో చల్లార్చుకున్నారు. అయితేనేమి మొక్కవోని దీక్ష వారిది. ఒక్కో అడుగు ముందుకేశారు. కష్టపడ్డారు. చెమటోడ్చారు. ఫలితం కనిపించింది. ఇపుడు వారంతా సిరులు పండిస్తున్నారు. ఎందరికో ఆదర్శమయ్యారు. ఇది అల్లిగూడెం ఆదివాసీల విజయగాథ.



అల్లిగూడెం వాసులు సొంతంగా నిర్మించుకున్న చెరువు





అల్లిగూడెం గ్రామస్తులందరూ చెరువు పనిలో శ్రమదానం.. వలస ఆదివాసీలు సొంతంగా నిర్మించుకున్న ఇల్లు

నాడు కట్టెలమ్ముకొని కడుపునింపుకున్నారు.. నేడు సిరులు పండిస్తున్నారు

ప్రతి నీటి బొట్టుని ఒడిసిపడుతున్నారు.. అల్లిగూడెం వలస ఆదివాసీల విజయగాథ

ఇదొక చిన్న కుగ్రామం. కేవలం 60 కుటుంబాలు నివాసం ఉండే గిరిజన పల్లె అది. కానీ వారి కృషి మాత్రం స్ఫూర్తివంతమైంది. వలస జీవులుగా వచ్చిన వారంతా ఎన్నో కష్టాలు పడ్డారు. ఎంతో స్వేదం చిందించారు. అయినా గానీ ముందుకే నడిచారు. అనుకున్నది సాధించారు. ఇప్పటికీ ఊరంతా కలిసి ఒకే మాట.. ఒకే మాటగా సాగుతున్నారు. ఆ కథేంటంటే.. నాలుగు దశాబ్దాల కిందట ఛత్తీస్‌గడ్, ఒడిస్సాల నుంచి పలు ఆదివాసీ కుటుంబాలు అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరుకు వలస వచ్చాయి. అక్కడ వారికి సాగుభూమి లేకపోవడం, జీవనోపాధి కష్టతరంగా మారడడంతో వారంతా ఇక్కడకు వలస రావాల్సి వచ్చిందని చెప్పేవారు. చింతూరుకు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న అల్లిగూడెంలో చెట్ల కింద, గుడారాలు వేసుకుని కొంతకాలం జీవనం సాగించారు. ఈ సమయంలో అటవీ ప్రాంతంలో చిన్న చిన్న కట్టెలను సేకరించి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతూరుకు నడిచి వచ్చి విక్రయించేవారు. ఆ కొద్దిపాటి ఆదాయంతో పొట్టపోసుకునేవారు. తర్వాత అల్లిగూడెంలోనే స్థిరనివాసం ఏర్పాటుచేసుకుని అదే ప్రాంతంలో పోడుసాగుకు ఉపక్రమించారు. ఈ విషయం తెలుసుకున్న అటవీ అధికారులు వారిపై కేసులు నమోదు చేశారు. దీంతో వారిలో పలువురు జైళ్లపాలు కావాల్సి వచ్చింది. అయినా వారు వెరువలేదు. చావైనా బతుకైనా ఇక్కడేనని భీష్మించారు. బతుకుపోరులో ఎన్నో కష్టాల్ని, నష్టాల్ని భరించారు. తినడానికి తిండిలేని రోజుల్ని చూశారు. ఉండటానికి గూడు లేదు.. చెట్ల నీడే ఆవాసాలు. చివరకు అంతా కలిసి వ్యవసాయం చేయడమే జీవనంగా భావించారు. మగవారంతా భూమి చదును పనిలో పడ్డారు. ఇక కట్టెలమ్మడం మహిళల వంతు. అందుకు కాలినడకన ప్రతి రోజూ చింతూరు రావాల్సి వచ్చేది. ఇట్లా రోజులు, నెలలు కాదు ఏళ్ల తరబడి సాగిన జీవనయాత్ర ఇది. మొత్తంమీద నేలను సాగుకు అనుకూలంగా మలచుకున్నారు. అంతా చేతుల కష్టమే. ఇక మిగిలింది కాసింత గూడు. చేతిలో చిల్లిగవ్వలేదు. అయినా లక్ష్యపెట్టలేదు. ఉమ్మడి కష్టంతో ఇళ్లు నిర్మించుకున్నారు. సాగూ మొదలు పెట్టారు. అయితే నీటి కొరతతో పడ్డ కష్టం చేతికందకుండా పోయేది. దీంతో ఆ సమస్యను అధిగమించాలనుకున్నారు. దీంతో ఊరంతా ఒక్కటై సొంతంగా చెరువులు తవ్వుకున్నారు. వర్షం నీటిని తమ తమ చెరువుల్లోకి వచ్చిపడేలా కాలువలు తవ్వుకున్నారు. చెరువులు నిండాయి. పంటలు పండించారు. చెరువుల్లో చేపలు విడిచారు. ఇప్పుడు ఊరిలో నలభైకిపైనే చెరువులున్నాయి. ప్రతి కుటుంబానికి రెండు, మూడెకరాల పొలం సాగు చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే ఈ పల్లెకు కనీస సౌకర్యాలు కల్పిస్తున్నారు. వీరు పిల్లలను చదివించుకుంటున్నారు. కానీ.. ఈ పొలాలు అటవీ భూములు కావడడంతో పట్టాలు లేవు. వలస జీవులు కావడంతో కుల ధ్రువీకరణ పత్రాల్లేవు. వీటికోసం వీరంతా పోరాడుతున్నారు.



కాకినాడ జీజీహెచ్‌లో హరేకృష్ణా మూమెంట్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భోజన సదుపాయం

అన్నార్తులకు 'అక్షయపాత్రే'

కాకినాడ జీజీహెచ్‌లో హరేకృష్ణా మూమెంట్ సంస్థ ఆధ్వర్యంలో 'సుభోజనం'

నిత్యం రెండు వేల మంది రోగులు, సహాయకులకు ఉచితంగా భోజనం

(ఆంధ్రజ్యోతి- కాకినాడ జీజీహెచ్)

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రి.. గోదావరి జిల్లాలతోపాటు విశాఖ సరిహద్దు ప్రాంతాల వారికి ఆరోగ్య వరప్రదాయిని. జీజీహెచ్‌కు వైద్యచికిత్సల కోసం నిత్యం వేలాదిమంది రోగులు వస్తుంటారు. ఇక్కడికి వచ్చేవారంతా మధ్యతరగతి, నిరుపేదలే. వీరు హోటళ్లకువెళ్లి డబ్బులు ఖర్చుచేసి భోజనం చేసే పరిస్థితి ఉండదు. వీరి పరిస్థితిని గమనించిన హరేకృష్ణా మూవెంట్ సంస్థ ఉచితంగా సుభోజనం పేరిట కమ్మని భోజనం అందిస్తోంది. హరేకృష్ణా మూమెంట్ సంస్థను భక్తి వేదాంత ప్రభుపాద స్వామి స్థాపించారు. ఒకరోజు బెంగళూరులో భవనం పైఅంతస్తులో కూర్చొని కిటికీలో నుంచి కిందకు తొంగి చూస్తుండగా అక్కడ జరిగిన సంఘటన అక్షయపాత్ర ఏర్పాటుకు బీజం పడింది. రోడ్డు పక్కన పడేసిన విస్తర్లు, ఆకుల్లో ఉన్న ఆహారంకోసం బాలురు, కుక్కలు పోట్లాడుకోవడాన్ని చూసి ఆయన చలించిపోయారు. నిరుపేదల ఆహారం కోసం పడుతున్న ఇబ్బందులు భవిష్యత్తులో ఎక్కడా పడరాదని, ముఖ్యంగా విద్యార్థులు, అన్నార్తులకు ఈ స్థితి ఉండకూడదని భావించారు. హరేరామ్ మూమెంట్ సంస్థ ఉన్న ప్రదేశం నుంచి పది కిలోమీటర్ల పరిధిలో ఏ వ్యక్తి ఆకలితో అలమటించరాదనే ఆశయంతో 2000 సంవత్సరంలో అక్షయపాత్రను బెంగళూరులో తొలుత 1500 మంది విద్యార్థులకు భోజనం అందించే కార్యక్రమాన్ని భక్తి వేదాంత ప్రభుపాదస్వామి ప్రారంభించారు. ఇలా మొదలైన ఈ మూమెంట్ ఇప్పుడు అన్నిచోట్లా విస్తరించింది. మన ప్రాంతంలో విశాఖ కేజీహెచ్‌తోపాటు కాకినాడ జీజీహెచ్‌లో అక్షయపాత్ర ఆధ్వర్యంలో సుభోజనాన్ని రోగులకు ఉచితంగా అందిస్తున్నారు. తొలుత కాకినాడ జీజీహెచ్‌లో రూ.10కే కమ్మని భోజనం ప్రారంభించిన నిర్వాహకులు దాతల సహకారంతో తర్వాత ఉచితంగా రోగులకు ఆహారాన్ని అందించి రోగులు, సహాయకుల కడుపు నింపుతున్నారు. కాకినాడ జీజీహెచ్‌లో వైద్యసేవల కోసం నిత్యం 3వేల నుంచి 3,500 మంది వరకు వచ్చి ఓపీల ద్వారా వైద్యచికిత్స పొందుతుంటారు. ఇన్‌పేషెంట్లుగా మరో 2 వేలమంది వైద్యసేవలు పొందుతుంటారు. జీజీహెచ్ ప్రాంగణంలో సర్జికల్ వార్డుల వద్ద హరేకృష్ణా మూవెంట్ ఆధ్వర్యంలో 2017లో ప్రారంభించిన సుభోజనం నిత్యం రెండు వేల మందికి ఉచితంగా అందిస్తున్నారు. ముఖ్యంగా వైద్యచికిత్సల కోసం ఆస్పత్రికి వచ్చే వారి సహాయకులు బయట తినాలంటే వంద నుంచి రూ.150 వరకు ఖర్చుపెట్టాల్సిన పరిస్థితి. ఇప్పుడు ఉచితంగా లభించడంపై సంతోషం వ్యక్తంచేస్తున్నారు. సుభోజనంలో అన్నంతోపాటు ఒక కూర, పప్పు, సాంబారు, పెరుగు వడ్డిస్తారు. దాతల సహకారాన్ని బట్టి ఒక్కోసారి ప్రత్యేక వంటకాలనూ వడ్డిస్తున్నారు.



వాడపల్లి వెంకన్న ఒక్కరోజు
ఆదాయం రూ.2.67లక్షలు



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు చేస్తున్న భక్తులు

ఆత్రేయపురం, నవంబరు8(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,67,940 లభించినట్టు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు.

కార్తీక శనివారాల్లో భక్తులకు లఘు దర్శనమే



ఉపకమిషనర్ సూర్యచక్రధరరావు

వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం నాలుగు శనివారాలు భక్తులకు లఘుదర్శనమే అందిస్తున్నట్లు ఉప కమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు పేర్కొన్నారు. కార్తీక శనివారాలలో భక్తుల రద్దీ అంచనాలకు మించి తరలిరావడంతో క్యూలైన్లలో భక్తులు గంటల వ్యవధి వేచి ఉంటున్నారు. వేద ఆశీర్వచనం విశిష్ఠ, సర్వదర్శనం, తదితర టిక్కెట్లు పొందిన భక్తులకు లఘుదర్శనం మాత్రమే అందిస్తున్న ట్లు వివరించారు. ఈ విషయాన్ని భక్తులు గమనించి సహకరించాలని కోరారు.

భీమేశ్వరుడి అన్నదాన ట్రస్టుకు రూ. 100116 విరాళం

ద్రాక్షారామ, నవంబరు8(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి అన్నదాన ట్రస్టుకు గురువారం ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం పూళ్ల గ్రామానికి చెందిన బొండాడ కస్తూరి కుమారుడు బొండాడ సుబ్బరాజు రూ.1001116లు అందజేశారు. ఆలయ సీనియర్ సహాయకుడు సూరపురెడ్డి వెంకటేశ్వరరావు బొండాడ సుబ్బరాజు దంపతులకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.



సుబ్బరాజు దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న సిబ్బంది



ఆంధ్రప్రదేశ్ దిగ్దర్శనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్

రాష్ట్ర సాంస్కృతిక వైభవం
పునరుద్ధరణకు కృషి

- రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖల మంత్రి కందుల దుర్గేష్

దివాన్‌చెరువు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎంతో విశిష్టత కలిగిన ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవాన్ని పునరుద్ధరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్, కామర్స్ కళాశాల ఆంగ్ల విభాగం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి, సెంటర్ ఫర్ ఆంధ్రప్రదేశ్ స్టడీస్ (కాప్స్) సంయుక్త ఆధ్వర్యంలో నన్నయ ప్రాంగణంలో రెండు రోజులు జరిగిన ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం సదస్సు శుక్రవారం ముగిసింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఆదికవి నన్నయ, టంగుటూరిప్రకాశంపంతులు, కందుకూరి వీరేశలింగం వంటి మహనీయులు రాజమహేంద్రవరంలో నడయాడారని, కోస్తా తీరంనాగరికతకు నెలవు అని చెప్పారు. రాష్ట్రంలో ఎన్నో కళారూపాలు ఉన్నాయని, వాటిని సినిమా వైపు మాత్రమే కాకుండా స్వీయ అభిలాషతో స్వీకరించి ఆదరించాలన్నారు. తెలుగు భాష చాలా ప్రాచీనమైనదని, దాని ఆధారాలను భద్రపరుచుకోవలసిన అవసరం ఉందన్నారు. తెలుగు భాష, సంస్కృతి, సాహిత్యాలను ప్రపంచ దేశాలకు తెలియజెప్పాలన్నారు. సంస్కృతి వైభవం కోసం కృషి చేసే విధంగా ముందడుగు వేయాలన్నారు. చరిత్రను అర్థం చేసుకుంటేనే భవిష్యత్తును నిర్మించుకోగలమన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషిచేస్తామన్నారు. తెలుగు విశ్వవిద్యాలయాన్ని రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసేందుకు పాటుపడతామన్నారు. ఆంధ్రప్రదేశ్ దిగ్దర్శనం, ఆంధ్రశక్తి వారి ఈట్ టూ ఫీడ్ పుస్తకాలను, వీసీ శ్రీనివాసరావు రూపొందించిన జియాలజికల్ మ్యాప్‌ను మంత్రి ఆవిష్కరించారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ప్రత్యేక నిధులు తీసుకువచ్చి విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కాప్స్ అధ్యక్షుడు డాక్టర్ కర్రి రామారెడ్డి, ప్రతినిధి సీహెచ్ విజయానంద ఆదిత్య, కన్వీనర్లు ఆచార్య కె.శ్రీరమేష్, ఆచార్య డి.జ్యోతిర్మయి పాల్గొన్నారు.

కొనసాగుతున్న జిమ్నాస్టిక్స్ పోటీలు

- రెండో రోజు విజేతలు వీరే

కాకినాడ అర్బన్, నవంబరు 8: పాఠశాలల రాష్ట్ర సమాఖ్య 68వ జిమ్నాస్టిక్స్ అంతర్‌జిల్లాల పోటీలు కాకినాడ డీఎస్‌ఏ మైదానంలోని ఆడిటోరియంలో రెండోరోజు కొనసాగాయి. వివిధ విభాగాలు క్రీడాకారులు తమ ప్రతిభనుచాటారు.

- ఆల్‌రౌండ్ చాంపియన్‌షిప్ అండర్-14 బాలికల విభాగంలో కె.సరయు(కృష్ణా) మొదటి స్థానం, ఎస్‌కే నషీమా(గుంటూరు) రెండోస్థానం, వై.కిరణ్మయి(వైఎస్‌ఆర్ కడప) తృతీయస్థానంలో నిలిచారు. అండర్-17 ఆల్‌రౌండ్ చాంపియన్‌షిప్‌లో ఎస్.కీర్తన(కృష్ణా), పి.అస్మిత(గుంటూరు), ఎస్ఎల్ మధులత (తూర్పుగోదావరి) విజేతలుగా నిలిచారు.



జిమ్నాస్టిక్స్ పోటీల్లో విన్యాసాలు చేస్తున్న క్రీడాకారులు

పోలవరం జల విద్యుత్ కేంద్రంలో
స్టేరింగ్ అమరిక పనులు ప్రారంభం

దేవీపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోలవరం జల విద్యుత్ కేంద్రంలో టర్బైన్ల ఏర్పాటులో కీలకమైన స్టేరింగ్‌ల అమరిక పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇందుకు 320 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన క్రాలర్ క్రేన్ వినియోగిస్తున్నారు. తొలుత ఏపీ జెన్‌కో ఎస్ఈ రామభద్రరాజు, ఈఈ వై.భీమదనరావు, ఎంఈఐఎల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్ బాబు అంగర, ఎలక్ట్రో మెకానికల్ విభాగం సీనియర్ మేనేజర్ మణికంఠ పాల్గొన్నారు. ఒక్కో స్టేరింగ్ 4 విభాగాలుగా ఉంటుంది. బరువు 136 మెట్రిక్ టన్నులు. విద్యుత్ ఉత్పత్తికి వినియోగించే కప్లాన్ టర్బైన్లు సమర్థవంతంగా పనిచేయడంలో ఈ స్టేరింగ్‌లు కీలక పాత్ర పోషిస్తాయి. ప్రాజెక్టులో కీలకమైన నిర్మాణ పనులను వీటి అమరిక తర్వాత తరువాత కొనసాగిస్తారు. ఎస్ఈ రామభద్రరాజు మాట్లాడుతూ... జల విద్యుత్ కేంద్రంలో స్టేరింగ్‌ల ఏర్పాటు తర్వాతే టర్బైన్లు అమరుస్తారని తెలిపారు. ప్రాజెక్టు పనులుజాప్యం కాకుండా ఉండేందుకు అన్ని పనులు సమాంతరంగా చేస్తున్నట్టు తెలిపారు. నిర్దేశించిన సమయానికి ప్రాజెక్టు పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నట్టు ఎంఈఐఎల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్‌బాబు చెప్పారు.



జలవిద్యుత్ కేంద్రం వద్ద స్టేరింగ్ అమరిక పనులు నిర్వహిస్తున్న దృశ్యాలు

ఎమ్మెల్సీ ఎన్నికలకు రాజకీయ ప్రతినిధులు సహకరించాలి

- కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్ కోర్టుహాలులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసిందన్నారు. నవంబరు 11న ఎన్నికల నోటిఫికేషన్ జారీ అవుతుందన్నారు. ఈనెల 18 వరకు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. ఈనెల 19న నామినేషన్లు పరిశీలన ఉంటుందన్నారు. ఈనెల 21న నామినేషన్లు ఉపసంహరణ చేసుకోవచ్చునన్నారు. డిసెంబరు 5న పోలింగ్, పోలింగ్ బ్యాలెట్ పేపర్ ద్వారా మాత్రమే నిర్వహిస్తారన్నారు. డిసెంబరు 9న ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. ఈ దృష్ట్యా తూర్పు, పశ్చిమ గోదావరి ఉమ్మడి జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. కాకినాడ జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా, ఈఆర్వోగా కాకినాడ జిల్లా డీఆర్వో వ్యవహరిస్తారన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో 113 మండలాల్లో మొత్తం 16,316మంది ఓటర్లు ఉన్నారన్నారు. అందులో 9642మంది పురుషులు, స్త్రీలు 6674 మంది ఉన్నారన్నారు. 116 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ ఆఫ్ ఎలక్టోరల్ రోల్ 2025 కింద 29-10-2024న డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేశామన్నారు.

కాకినాడ జిల్లాలో 16లక్షల35వేల30మంది సాధారణ ఓటర్లుగా నమోదయ్యారన్నారు. ఇందులో 8,04,834మంది పురుషులు, 8,30,002మంది మహిళలు, 190మంది ఇతరులు ఉన్నారన్నారు. 18ఏళ్లు నిండిన వారు ఎవరైనా తమ ఓటుహక్కును నమోదు చేసుకునేందుకు స్పెషల్ క్యాంపెయిన్ డేస్‌గా ఈనెల 9,10,23,24 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. బీఎల్‌వోలు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్‌స్టేషన్‌లో అందుబాటులో ఉంటారని అర్హులు తమ సమీప పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వో వద్ద ఓటు నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఆమ్‌ఆద్మీపార్టీ రామకృష్ణ, బీఎస్పీ అప్పారావు, బీజేపీ వెంకటేశ్వర రావు, టీడీపీ జయప్రకాష్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నోడల్ అధికారిగా జడ్పీ సీఈవో

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) జిల్లా నోడల్ అధికారిగా తూర్పు గోదావరి జిల్లా జడ్పీ సీఈవో లక్ష్మణరావును నియమించారు. ఈ మేరకు కాకినాడ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులను వెలువరించారు. ఎంసీసీ నోడల్ అధికారిగా ఆయన కోడ్ ఉల్లంఘనలపై చర్యలు తీసుకుంటారు.

ఎటువంటి చర్చ లేకుండా ముగిసిన
స్థాయీ సంఘాల సమావేశాలు

కాకినాడ సిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి చర్చ, ఏ విధమైన తీర్మానాలు లేకుండా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలను ముగించారు. శుక్రవారం కాకినాడలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన 1 నుంచి 7 వరకు స్థాయి సంఘాల సంఘాల సమావే శాలకు జడ్పీ చైర్మన్ వి.వేణుగోపాలరావు, వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, వైస్‌చైర్‌పర్సన్ పద్మలత, స్థాయిసంఘ చైర్‌పర్సన్ మేరుగు పద్మావతి అధ్యక్షత వహించారు. సమావేశాల్లో జడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో జీఎస్ రామ్‌గోపాల్, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు


సత్యదేవుని దర్శనానంతరం కుటుంబీకులతో న్యాయమూర్తి

సత్యదేవునికి పాట్నా హైకోర్టు న్యాయమూర్తి

అనుపమ చక్రవర్తి పూజలు

అన్నవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధికి శుక్రవారం పాట్నా హైకోర్టు న్యాయమూర్తి అనుపమ చక్రవర్తి కుటుంబ సభ్యులతో విచ్చేశారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.


పంపా సరోవరంలో ట్రయల్ రన్ నిర్వహిస్తున్న అధికారులు

హంస వాహనం పంటుకు ట్రయల్ రన్

అన్నవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి ప్రతిఏటా క్షీరాబ్ది ద్వాదశి పర్వదినాన నిర్వహించే తెప్పోత్సవం ఈనెల 13న జరగనుంది. ఈ నేపథ్యంలో పంటుకు శుక్రవారం దేవస్థానం ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్ అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. పంటు వేగం, ఎక్కడి నుంచి ఎక్కడకు సరోవరం చుట్టూ విహరించాలనే దానిపై ఒక అవగాహనకు వచ్చారు. రెండ్రోజుల్లో ఈ పంటును హంస వాహనంగా అలంకరించి రెవెన్యూ, పోలీసు, దేవస్థానం, ఇతర శాఖల అధికారుల సమక్షంలో మరోసారి ట్రయల్ రన్ నిర్వహిస్తామని ఎలక్ట్రికల్ డీఈ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పీఆర్వోకు చెక్కు అందజేస్తున్న దాత వెంకటరెడ్డి

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి

రూ.లక్ష విరాళం

అన్నవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం విశాఖపట్నానికి చెందిన కె.బాలసుబ్రహ్మణ్యం రూ.1,00,116 విరాళంగా సమర్పించారు. దాత ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో ఆలయ పీఆర్వో వెంకటరెడ్డికి అందజేశారు. దాతను ఆయన అభినందించి ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించి స్వామివారి ప్రసాదం అందజేశారు.

నేటి నుంచి రామస్వామి జయంత్యుత్సవాలు

పిఠాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద శ్రీవల్లభుల స్వామి జన్మస్థానంగా ప్రసిద్ధి గాంచిన శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానం పీఠాధిపతి, గురువు సజ్జనగడ రామస్వామి శత జయంతి మహోత్సవాలు శనివారం ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మహా సంస్థానం గోశాల ప్రాంగణంలో జరిగే ఉత్సవాల్లో తొలి రోజైన 9వ తేదీ ఉదయం విఘ్నేశ్వరుని పూజ, పుణ్యాహవాచనం, రుత్విక్‌వరుణ, శ్రీపాదశ్రీవల్లభ స్వామికి శత రుద్రీయ అభిషేకం, సద్గురు రామస్వామి పాదుకలకు అభిషేకం, పూజ జరుగుతాయి. సాయంత్రం హోమం, చతుర్వేద స్వస్తి. 10వ తేదీ శ్రీపాద శ్రీవల్లభులు, సజ్జనగడ రామస్వామి దివ్య పాదుకలకు శత రుద్రీయ అభిషేకం, హోమం, నీరాజన మంత్రపుష్పాలు, చతుర్వేద స్వస్తి. 11వ తేదీన సద్గురు రామస్వామి శతజయంతి సందర్భంగా శ్రీపాదులు, రామస్వామి దివ్యపాదులకు అభిషేకాలు, పూజ, హోమం, పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పాలు, చతుర్వేద స్వస్తి, మహదాశీర్వచనం నిర్వహిస్తారు. భక్తులు తరలివచ్చి శ్రీపాదశ్రీవల్లభులు, సజ్జనగడ రామస్వామి గురువర్యుల అనుగ్రహానికి పాత్రులు కావాలని మహా సంస్థానం కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య కోరారు. జయంత్యుత్సవాలకు విచ్చేసే భక్తుల కోసం ఏర్పాట్లు చేస్తున్నామని ఆమె చెప్పారు.



ఇంగ్లీష్ టీచర్ సస్పెన్షన్

కాకినాడ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తూరంగి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్‌గా పని చేస్తున్న మహ్మద్ తానీషా వలీబాబాను సస్పెండ్ చేస్తూ డీఈవో పి.రమేష్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఆ ఉపాధ్యాయుడిపై ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం ద్వారా కేసు నమోదైంది. ఆ అభియోగాలన్నీ రుజువైన కారణంగా విధుల నుంచి సస్పెండ్ చేశామన్నారు. అయితే అతను గతంలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన పాఠశాలల్లో కూడా ఈ విధంగా ప్రవర్తించాడని తెలిసింది. విద్యార్థినులకు అసభ్యకరమైన వీడియోలు చూపించేవాడని సమాచారం.

కూటి కోసం వెళ్లి... కానరాని లోకాలకు..


సంఘటనాస్థలంలో గల్లంతైన వారి కోసం గాలింపు


బాధిత కుటుంబాన్ని ఓదారుస్తున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ

- ఒకరిని కాపాడబోయి... మునిగిపోయిన మరో ముగ్గురు...
- నలుగురి గల్లంతుతో రోడ్డునపడ్డ రెండు కుటుంబాలు
- ఇద్దరి మృతదేహాలు లభ్యం
- అల్లూరి జిల్లా అడ్డతీగల మండలం బొంగరాలపాడు ఏలేరు వాగులో ఇసుక తీస్తుండగా దుర్ఘటన
- ఏలేశ్వరం మండలం తూర్పు లక్ష్మీపురంలో విషాదఛాయలు

అడ్డతీగల/ఏలేశ్వరం/తాళ్లపూడి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం తూర్పులక్ష్మీపురం గ్రామానికి చెందిన వీరమళ్ల భూషణం(60), అతడి కుమారుడు వీరమళ్ల జయబాబు(26), అతడి అల్లుడు తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం అన్నదేవర పేటకు చెందిన బేదంపూడి చిన్నగొంతియ్యతోపాటు తూర్పులక్ష్మీపురానికి చెందిన మరో వ్యక్తి చింతా శ్రీనివాస్(19) కూలి పనులు చేస్తుంటారు. తూర్పులక్ష్మీపురం గ్రామానికి అడ్డతీగల మండలం బొంగరాలపాడు ఏలేరువాగు దగ్గర్లోనే ఉంటుంది. అక్కడ ఇసుక తవ్వకం పనులకు వెళ్లి ఉపాధి పొందుతుంటారు. ఇసుక తవ్వి దాన్ని ట్రాక్టర్లలో లోడింగ్ చేసి పరిసర ప్రాంతా లకు తరలించే పనిచేస్తుంటారు. ఇక్కడ ఇసుక ర్యాంపునకు అనుమతి లేదు. కొన్నాళ్ల క్రితం ఈ ప్రదేశంలో ఇసుక తవ్వకాలు జోరుగా జరిగాయి. దీంతో అక్కడ గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల వర్షాలకు ఆ ప్రాంతమంతా నీరు ఎక్కువగా చేరి ఆ గుంతలు బురదతో నిండి ఊబి మాదిరిగా మారాయి. ఈ నేపథ్యంలో ఆ వాగులో ఇసుక తీసే ప్రాంతంలో ప్రమాదకరంగా ఉంది. కాగా శుక్రవారం కూడా అదే మాదిరిగా ఇసుకతీత పనినిమిత్తం అక్కడకు చేరుకున్నారు. కానీ, అక్కడ గుంతలు ఏర్పడిన విషయం గ్రహించలేకపోయారు.మధ్యాహ్నం ముగ్గురూ ఇసుకతీతకోసం వాగులోకి దిగారు. ఒడ్డునే ట్రాక్టర్ కూడా ఉంది. మళ్లీ వాగు లోపలికి వెళ్లగా తొలుత ఒకరు ప్రమాదవశాత్తూ లోపలికి మునిగిపోతున్నారు. అతడ్ని కాపాడే ప్రయత్నంలో మరొకరు.. తర్వాత ఇంకొకరు ఇలా నలుగురూ వాగులో మునిగిపోయారు. అంతా క్షణాల్లో జరిగిపోయింది. ఒకరిని కాపాడేందుకు వెళ్లి మరో ముగ్గురు కలిసి మొత్తం నలుగురు గల్లంతయ్యారు. ఇసుక తవ్వకాలకు వెళ్లి గల్లంతైన నలుగురూ పేద కుటుంబానికి చెందినవారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే తూర్పులక్ష్మీపురం నుంచి బంధువులు బొంగరాలపాడు సంఘటనా స్థలానికి బయలుదేరి వెళ్లిపోయారు. సాయంత్రానికి తిరిగి వచ్చేస్తానని చెప్పిన వారికి ఇలా జరగడంతో వారు రోదిస్తున్న తీరు కంటతడి పెట్టించింది.

బావ, బావమర్దుల మృతదేహాల వెలికితీత

అప్పటికే సమాచారం అందుకున్న పోలీసులు, డివిజన్ అధికారులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వీరిలో రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, డీఎస్పీ సాయిప్రశాంత్ పరిసరాలను పరిశీలించి ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో గాలింపు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వెంటనే ఆయా బృందాలు రంగంలో దిగి వలల సహాయంతో వీరమళ్ల జయబాబు, బేదంపూడి గొంతియ్య మృతదేహాలు వెలికితీశాయి. సంఘటనాస్థలాన్ని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి వెళ్లి పరిస్థితిని పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే సత్యప్రభ పరామర్శ

ఏలేరు వాగులో గల్లంతైన బాధితుల కుటుంబానికి సంఘటనాస్థలానికి వెళ్లి ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఓదార్చారు. ఆమె స్పందిస్తూ దుర్ఘటన జరగడం చాలా బాధాకరమని, వీలైనంత త్వరగా మృతదేహాలను వెలికితీయాలని అధికారులకు సూచించారు. బాధితుల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు.

చదువు ఆపేసి.. పనులకు వెళ్తూ...

ఇదే గ్రామానికి చెందిన చింతా గోపి, సత్యవతి దంపతులకు కుమారుడు శ్రీనివాస్(16). అతడికి దుర్గ అనే సోదరుడు, భూమిక అనే సోదరి ఉంది. అతడు ఇటీవలే ఏలేశ్వరం ప్రభుత్వజూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశం పొంది మధ్యలో చదువు ఆపేశాడు. కుటుంబపోషణకు కూలీ పనికి వెళ్తుంటాడు. భూషణం వెంట శ్రీనివాస్ కూడా వెళ్లి వాగులో గల్లంతు కావడంతో కుటుంబ సభ్యుల్లో విషాదం నింపింది.

ఒకే కుటుంబం... అతలాకుతలం

ఏలేశ్వరం మండలం తూర్పులక్ష్మీపురం గ్రామానికి చెందిన వీరమళ్ల భూషణం, వీరమళ్ల జయబాబు, తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన బేదంపూడి చిన్నగొంతియ్య ముగ్గురూ ఒకే కుటుంబానికి చెందినవారు. ఒకే కుటుంబంలో తండ్రి, కొడుకు, అల్లుడు ఇలా కావడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. వీరమళ్ల భూషణం కుమారుడు జయబాబు. వీళ్లు రోజువారీ కూలి పనులకు వెళ్తుంటారు. వీరివెంట బేదంపూడి చినగొంతియ్య కొన్నాళ్లుగా పనులకు వెళ్తున్నాడు. అతడు గతంలో తన స్వగ్రామంలో పెయింటింగ్ పనులు చేసేవాడు. ఇటీవల అతడి భార్య భారతిని ప్రసవానికి ఆమె పుట్టింటికి తీసుకువెళ్లాడు. అక్కడ అతనికి కొడుకు పుట్టాడు. అక్కడే తనమామ, బావమరిదితో పనులకు వెళ్తున్నాడు. ఈ తరుణంలో శుక్రవారం ఇసుకతీత, లోడింగ్ పనికి వెళ్లాడు. అక్కడ అనుకోకుండా జరిగిన ప్రమాదంలో మునిగిపోతున్నవారికి సహాయం చెయ్యబోయి గల్లంతయ్యాడు. దీంతో కుటుంబం అతలాకుతలమైంది.

రాష్ట్ర ప్రభుత్వ అవార్డుకు సామర్లకోట ఉర్దూ ఉపాధ్యాయుడి ఎంపిక


సయ్యద్ సైఫులా

సామర్లకోట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సామర్లకోటలో అగస్తానా మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఉర్దూ పాఠాలు బోధించే ఎస్‌జీటీ ఉర్దూ పండిట్ సయ్యద్ సైఫుల్లా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయుడిగా ప్రభుత్వ అవార్డుకు ఎంపిక చేస్తూ శుక్రవారం రాత్రి అమరావతి నుంచి ఏపీ రాష్ట్ర ఉర్దూ అకాడమీ (విజయవాడ) సంచాలకుల నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. నవంబరు 11 మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి పురష్కరించుకుని ఏటా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డులు అందజేయడం జరుగుతుంది. ఈ అందులో భాగంగా ప్రభుత్వం ఈ పురస్కారానికి సయ్యద్ సైఫులాను ఎంపిక చేసింది. 24ఏళ్ల ఉర్దూ పండిట్‌గా సామర్లకోట మున్సిపల్ పాఠశాలలో ఆయన పనిచేస్తున్నారు. ఈనెల 11న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆవార్డు అందుకోనున్నారు.

సెలవులోకి కాకినాడ జేసీ

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేసీ రాహుల్‌మీనా వ్యక్తిగత పనులపై సెలవులోకి వెళ్లారు. వచ్చే బుధవారం జిల్లాలో ఆయన తిరిగి అందుబాటులోకి వస్తారని కలెక్టరేట్ అధికారులు తెలిపారు. ఇన్‌ఛార్జి జేసీగా డీఆర్వో వెంకట్రావు బాధ్యతలు నిర్వహిస్తారు.

భర్త ఇంటి వద్ద మౌన పోరాటం

తనను, పిల్లలను వదిలేశాడని ఆవేదన

వేరే మహిళతో సహజీవనం చేస్తున్నాడని ఆరోపణ

పవన్ కల్యాణ్ న్యాయం చేయాలని వినతి


భర్త ఉంటున్న ఇంటి ఎదుట ఇద్దరు పిల్లలతో కలిసి మౌన పోరాటానికి దిగిన సౌమ్యలక్ష్మి

పిఠాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేరే మహిళతో సహజీవనం చేస్తూ తనను వదిలించుకోవాలని చూస్తున్నాడని, ఇద్దరు పిల్లలకు అన్యాయం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తూ ఇద్దరు కుమార్తెలతో కలిసి ఒక మహిళ కాకినాడ జిల్లా పిఠాపురంలోని భర్త ఇంటి ఎదుట మౌన పోరాటానికి దిగింది. తన భర్త తనకు కావాలని, పిల్లలను అన్యాయం చేయవద్దని ఆమె కోరింది. మహిళ తల్లిదండ్రులు పెంకే త్రిమూర్తులు, సరస్వతి తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం వెదురుమూడి గ్రామానికి చెందిన పెంకే సౌమ్యలక్ష్మికి రాజమహేంద్రవరం లలితానగర్‌కు చెందిన విత్తనాల రామలక్ష్మణకుమార్‌తో 2017లో అన్నవరంలో వివాహమైంది. పెళ్లయిన నాటి నుంచి భర్త, అత్తమామలు తరచూ అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తుండడంతో అంగర పోలీసుస్టేషన్లో గతంలో ఫిర్యాదు చేశారు. అనంతరం కూడా వారు వేధింపులు ఆపలేదు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈలోగా రామలక్ష్మణకుమార్ పిఠాపురం పట్టణంలోని వైఎస్ఆర్ గార్డెన్స్‌లో వేరే మహిళతో సహజీవనం చేయడం ప్రారంభించాడు. పిల్లలకు అన్యాయం చేయవద్దని కలిసి ఉందామని తన కుమార్తె కోరినా అల్లుడు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భర్త ఎంతకూ పట్టించుకోకపోవడంతో సౌమ్యలక్ష్మి తనకు భర్త కావాలంటూ, తన పిల్లలకు తండ్రి కావాలంటూ వైఎస్సార్ గార్డెన్స్‌లో భర్త ఉంటున్న ఇంటి ఎదుట శుక్రవారం అందోళనకు దిగింది. చేపట్టింది. భర్త తనను, పిల్లలకు కాపురానికి తీసుకువెళ్లేవరకూ మౌన పోరాటం విరమించేది లేదని స్పష్టం చేశారు. కాగా భర్త పట్టించుకోకపోవడంతో తన కుమార్తె సౌమ్యలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు (5,6 ఏళ్లవయసు) అనాథలుగా మారారని తలిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. పిల్లలతో కలిసి సౌమ్యలక్ష్మి చేపట్టిన ఆందోళనకు కాకినాడ టీడీపీ మహిళా నేత సత్యభామ, జనసేన వీరమహిళ వెంకటలక్ష్మి, కుంచే మణి సంఘీభావం ప్రకటించారు.


ఎఫ్ఎల్ఎన్ శిక్షణలో కృత్యాన్ని పరిశీలిస్తున్న కోనసీమ డీఈవో సలీంబాషా

విద్యార్థులతో మమేకమై బోధించాలి

దివాన్‌చెరువు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులతో మమేకమై వారి స్థాయికి వెళ్లి విద్యా బోధన చేయాలని, అప్పుడే అభ్యసనా సామర్థ్యాలను చేరుకునే అవకాశం ఉంటుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఈవో షేక్ సలీంబాషా అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం కొండగుంటూరులో ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఆటపాటలతో కూడిన విద్యను అందించేందుకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ దోహదం చేస్తుందన్నారు. ఉపాధ్యాయులు చేస్తున్న యాక్టివిటీస్‌ను ఆయన స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. శిక్షణా కేంద్రం వెన్యూ ఇన్‌చార్జి పి.రాంబాబు ఉపాధ్యాయులు శిక్షణ పొందుతున్న విధానాన్ని డీఈవోకు వివరించారు. ఉపాధ్యాయుల నుంచి డీఈవోఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. డీఈవో వెంట కోనసీమ జిల్లా సమగ్ర శిక్షా సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, రాష్ట్ర పరిశీలకుడు అరవ ప్రభాకర్, ఏపీ ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ పి.సాయి వెంకటరమణ ఉన్నారు.

బాలికను మోసగించిన ఆటో డ్రైవర్ అరెస్టు


ప్రత్తిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదో తరగతి చదువున్న బాలికకు మాయమాటలు చెప్పి లోబరుచుకున్న ఆటో డ్రైవర్‌ను ప్రత్తిపాడు పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. దీనికి సంబంధించి సీఐ బి.సూర్యఅప్పారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంరాచపల్లికి చెందిన ఆటో డ్రైవర్ పెదిరెడ్డి కృపారాజు తన కుమార్తె, కుమారుడులతో పాటు అదే గ్రామానికి చెందిన 8వ తరగతి బాలికను రోజూ స్కూలుకు తీసుకెళ్లేవాడు. ప్రేమిస్తున్నాను, పెళ్లి చేసుకుందామని మాయమాటలు చెప్పి లోబరుచుకున్నాడు. గత నెల 30న బాలికను తీసుకుని ధర్మవరం, రాజమహేంద్రవరం, భీమవరం, కాకినాడ పరిసర ప్రాంతాల్లో తిప్పుతూ పలుసార్లు శారీరక సంబంధం పెట్టుకున్నాడు. తొలుత బాలిక తల్లిదండ్రులు తమ కుమార్తె కనిపించట్లేదని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. అయితే ఆ బాలిక తల్లిదండ్రుల వద్దకు చేరుకుంది. తహసీల్దారు వద్ద జరిగిన సంఘటనలను వివరించింది. దీంతో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు పెద్దాపురం ఎస్‌డీపీవో బి.శ్రీహరిరాజు దర్యాప్తు నిర్వహించి నిందితుడు కృపారాజుపైపోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడిని పట్టుకునేందుకు డీఎస్పీ ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 7న ధర్మవరం గ్రామ శివారున అరెసుట చేసి కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. త్వరితగతిన విచారణ పూర్తి చేసి బాలిక ఆచూకీ కనుగొని నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపడంలో కృషి చేసిన పెద్దాపురం డి.శ్రీహరిరాజు, ప్రత్తిపాడు సీఐ సూర్యఅప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతంలను ఎస్పీ అభినందించారు.

భర్తపై అలిగి... శవమై తేలి

పోలవరం కాలువలో మహిళ మృతదేహం అభ్యం


ఏసమ్మ (పాత చిత్రం)

జగ్గంపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట-గోకవరం రోడ్డులో పోలవరం కాలువలో శుక్రవారం మహిళ మృతదేహం లభ్యమైందని ఎస్ఐ రఘునాధరావు తెలిపారు. జగ్గంపేట సత్యవేణిపేటకు చెందిన నక్క ఏసమ్మ (22)కు, అదే గ్రామానికి చెందిన వెలుగుల వీర దుర్గాప్రసాద్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. వారికి పది నెలల బాబు ఉన్నాడు. ఏసమ్మ భర్తతో తరుచూ గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయేది. సర్దిచెప్పడంతో రెండు, మూడు రోజుల తర్వాత భర్త వద్దకు వచ్చేది. ఈ నెల 6వ తేదీ సాయంత్రం జగ్గంపేట సెంటర్లో పానీపూరీ తిన్న తర్వాత భర్తను సినిమాకు వెళ్దామని అడిగింది. భర్త సమయం లేదని చెప్పడంతో మనస్థాపానికి గురై ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. ఈ విషయాన్ని దుర్గాప్రసాద్ అత్తగారికి చెప్పాడు. ఆమె కూతురు తమ ఇంటికి రాలేదని చెప్పింది. కోపం తగ్గిన తర్వాత వస్తుందిలే అని చెప్పడంతో ప్రసాద్ ఎటువంటి ఫిర్యాదు చేయలేదు. ఈలోగా గ్రామానికి చెందిన వ్యక్తి పోలవరం కాలువలో మహిళ మృతదేహం కనిపించిందని ఏసమ్మ తల్లి వరలక్ష్మికి చెప్పాడు. దీంతో ఆమె పోలీసులకు విషయం తెలపగా వారు పోలవరం కాలువ వద్దకు వచ్చి మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతురాలి తల్లి వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.


పట్టుకున్న గంజాయిని , సరఫరా చేస్తున్న వ్యక్తిని చూపిస్తున్న పోలీసులు

21 కిలోల గంజాయితో యువకుడి అరెస్టు

ప్రత్తిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి వద్ద 21 కిలోల గంజాయితో ఓ యువకుడిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న సూర్యాపేట మండలం సూర్యాపేట సందు షైజార్‌కు చెందిన 29 ఏళ్ల కోలా మణికంఠ అలియాస్ మణిదీప్ గంజాయి తాగుతూ గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా పశుపుల్లంక అటవీ ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు 21 కిలోల గంజాయి తరలిస్తున్నాడు. అతడిని రాచపల్లి గ్రామ శివారున డీఎస్పీ శ్రీహరిరాజు ఆధ్వర్యంలో సీఐ బి.సూర్యఅప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం అరెస్టు చేశారు. నిందితుడిని పట్టుకున్న ప్రత్తిపాడు సీఐ, ఎస్ఐలను ఎస్పీ, డీఎస్పీలు అభినందించారు.

విహార యాత్రలో విషాదం

సోకిలేరు వాగులో కొట్టుకుపోయి యువకుడి మృతి


సత్యవరుణ్ (పాత చిత్రం)

మోతుగూడెం/మలికిపురం, నవంబరు 8 (ఆంధ్ర జ్యోతి): అల్లూరి సీతారామ రాజు జిల్లా మోతుగూడెం పరిధిలోని సోకిలేరు వాగుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నుంచి నలుగురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై శుక్రవారం విహార యాత్రకు వచ్చారు. సోకిలేరు వ్యూ పాయింట్ వద్ద ఆగి సెల్ఫీలు దిగారు. అనంతరం స్నానం చేయడం కోసం వాగులోకి దిగారు. వారిలో 20 ఏళ్ల గడ్డం సత్యవరుణ్ కాలు జారి ప్రవాహ వేగానికి వాగులో కొట్టుకుపోయాడు. స్నేహితులు కాపాడే ప్రయత్నం చేశారు. వెంటనే మోతుగూడెం ఎస్ఐ శివనారాయణకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. లక్కవరం నుంచి గత ఈతగాళ్లను రప్పించి వెతికించారు. కొద్దిసేపటి తర్వాత ఆచూకీ లభ్యమైంది. విగత జీవిగా పడి వున్న వరుణ్‌ను ఒడ్డుకు చేర్చి చింతూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే ప్రాణం కోల్పోయినట్టు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కాగా సత్యవరుణ్‌ది మలికిపురం మండలం ఇరుసుమండ గ్రామం. ఇతడు వెటర్నరీ కోర్సు చదివినట్టు సమాచారం. వరుణ్ తన చిన్నాన్న కుమారుడు, స్నేహితులతో కలిసి చింతూరు విహార యాత్రకు వెళ్లగా వాగులో కొట్టుకుపోయి మృతి చెందాడు. ఇతడి తండ్రి బాబూరావు గల్ఫ్‌లో ఉంటున్నాడు. తల్లి అరుణప్రియ ఇరుసుమండలో ఉంటుంది. తమ్ముడు చదువుకుంటున్నాడు.

సదరం ధ్రువీకరణాల పేరిట వసూళ్లు

వ్యక్తిని పట్టుకున్న సెక్యూరిటీ సూపర్‌వైజర్

రామచంద్రపురం (ద్రాక్షారామ), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సదరం ధ్రువీకరణ పత్రాలు ఇప్పిస్తానని వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిని శుక్రవారం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి సెక్యూరిటీ సూపర్‌వైజర్ పలివెల శ్రీనివాసరావు పట్టుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో మంగళ, శుక్రవారాల్లో నిర్వహించే సదరం క్యాంపునకు వచ్చే దివ్యాంగులకు ధ్రువీకరణ పత్రాలు చేయిస్తానని ఎం.రవికుమార్ అనే వ్యక్తి వసూళ్లకు పాల్పడుతూ మోసగిస్తున్నాడు. దీనిపై ఫిర్యాదులు రావడంతో ఆ వ్యక్తిని ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ ప్రవీణ్ వద్దకు తీసుకెళ్లగా ఆయన గట్టిగా నిలదీశారు. మంత్రి, తాము ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తుంటే వైద్యుల పేరుచెప్పి సొమ్ములు వసూలు చేస్తూ ఆసుపత్రికి చెడ్డపేరు తెచ్చేలా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పోలీసులు, మంత్రి సుభాష్ దృష్టికి డాక్టర్ ప్రవీణ్ తీసుకువెళ్లారు. పోలీసులు, మంత్రి సుభాష్ తండ్రి సత్యం రవికుమార్‌ను హెచ్చరించి వదిలిపెట్టారు. ఏరియా ఆసుపత్రి సమీపంలో మళ్లీ కనిపిస్తే కేసు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి ప్రజాపోరు

అమలాపురం టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సీపీఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల15వరకు సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ప్రజాపోరు నిర్వహిస్తున్నామని జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తిస్తూ ఈనెల14న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు.

బట్టేలంక వంతెనకు రక్షణ గోడ కట్టండి

మలికిపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): చింతలపల్లి మెయిన్ చానల్‌పై బట్టేలంక రోడ్డులో వంతెన రక్షణ గోడ కూలి ప్రమాదాలకు నిలయంగా మారిందని లక్కవరం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రుద్రరాజు గోపాలకృష్ణరాజు ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ట్రాఫిక్ రద్దీగాతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

శిథిలావస్థలో పశు వైద్య కేంద్రం

● భయంతో వైద్యులు, సిబ్బంది విధులు
● నిధులు లేక మధ్యలోనే నిలిచిపోయిన నూతన భవనం



కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న పశువైద్య కేంద్రం, మధ్యలో నిలిచిపోయిన పశువైద్య కేంద్రం కొత్త భవనం

అంబాజీపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు వైద్యం అందించే వైద్యాధికారి, సిబ్బందికి నీడలేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షానికి రికార్డులు తడిచిపోవడంతో పాటు శిథిల భవనంలో భయం భయంతో విధులు నిర్వహిస్తున్నారు. అంబాజీపేట మండలం ముక్కామల గ్రామంలో ఉన్న పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వెటర్నరి డిస్పెన్సరీ ఏర్పాటు చేశారు. ఈ పశువైద్య కేంద్రం ద్వారా ఆ చుట్టుపక్కల గ్రామాల్లోని పాడి పశువులకు వైద్యం అందిస్తారు. ముక్కామల పరిధిలోని వక్కలంక, పసుపల్లి, మడుపల్లి, ముక్కామల, కముజువారిలంక, ఇరుసుమండ, నేదునూరు తదితర గ్రామాల్లో 2500కు పైగా పాడి పశువుల, మేకలు, గొర్రెలు, కుక్కలు ఉన్నాయి. రోజుకు 15వాటికిపైగా వైద్యాధికారి డాక్టర్ దీపిక, సిబ్బంది వైద్యసేవలు అందిస్తారు. అయితే ఈపశువైద్యకేంద్రం శిథిలావస్థకు చేరుకోవడంతో విధులు నిర్వహించేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల పశువైద్య కేంద్రానికి పాములు రావడంతో భయానికి గురయ్యారు. అలాగే వైద్యానికి సంబంధించి పనిముట్లు, కిట్లను మూలన పాడేశారు. పశువైద్య కేంద్రానికి సంబంధించిన రికార్డులు వర్షానికి తడిచిపోవడంతో స్థానిక రైతు సేవా కేంద్రంలో భద్రపరిచిన్నట్లు వైద్యాధికారి తెలిపారు. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో ఈపశువైద్య కేంద్రాన్ని నిర్మించేందుకు నాబార్డు ద్వారా రూ.34లక్షలు మంజూరయ్యాయి. ఈనిధులతో స్థానిక పంచాయతీ సమీపంలో నిర్మాణాన్ని చేపట్టారు. నిర్మాణానికి సంబంధించి బిల్లులు చెల్లించకపోవంతో స్లాబు వేసి మధ్యలోనే వదిలేశారు. నిర్మాణం చేపట్టే ప్రాంతం తుప్పలతో నిండిపోయింది. ప్రభుత్వం స్పందించి మధ్యలోనే నిలిచిపోయిన పశువైద్య కేంద్రాన్ని పూర్తిస్థాయిలో నిర్మించి వినియోగంలోకి తీసుకురావాలని వైద్యులు, సిబ్బంది, పాడి రైతులు కోరుతున్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల గుర్తింపు శిబిరం


దివ్యాంగుల వివరాలు నమోదు చేసుకుంటున్న అధికారులు

ముమ్మిడివరం, నవంబరు8(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలో దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎలైమ్‌కో సంస్థ ఆధ్వర్యంలో ముమ్మిడివరంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో నిర్వహించిన శిబిరంలో ముమ్మిడివరం నగరపంచాయతీ, మండలం, తాళ్లరేవు, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాలకు చెందిన 528మంది దివ్యాంగ లబ్ధిదారులు హాజరయ్యారు. ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్య ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో ఐ.పోలవరం, కాట్రేనికోన, తాళ్లరేవు ఎంపీడీవోలు పీఎల్ఎస్ శర్మ, ఎస్‌వీ చలం, కె.సత్యనారాయణ, ముమ్మిడివరం మున్సిపల్ కమిషనర్ పీవీ సుధాకర్ పాల్గొన్నారు. ఎలైమ్‌కో సంస్థ వైద్యులు, విభిన్నప్రతిభావంతులసహాయ సంస్థ సీఆర్వో వైశ్రీరామ్ పాల్గొన్నారు. దివ్యాంగులకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అధికారులు వారి వివరాలు నమోదు చేసుకున్నారు. ఏవో ఏఎన్ శ్రీనివాస్, ఈవోపీఆర్డీ సీహెచ్ లక్ష్మీకల్యాణి, పంచాయతీ కార్యదర్శులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, వెలుగుసిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. టీడీపీ నాయకులు తాడి నరసింహరావు, దాట్ల పృథ్వీరాజ్, చెల్లి అశోక్, అరాని శ్రీనివాసరావు, యాళ్ల ఉదయ్, రంబాల రమేష్, పిల్లి నాగరాజు, దాట్ల బాబు, కురసాల శివబాబు, వైసీపీ నాయకులు కోలా బాబ్జి, సలాది రామచంద్రరావు సేవలందించారు.

ఘనంగా శ్రీఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

అంబాజీపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పుల్లేటికుర్రులో శ్రీఅభయ ఆంజనేయస్వామి వారి 27అడుగుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కూటమి, వైసీపీ నేతలు స్వామివారి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా వేదపండితులు శ్రీ శ్రీనివాసుల విజయ్ గోపాలాచార్యులు బ్రహ్మత్వంలో శిలామయ శ్రీఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ ఆవిష్కరణ,మహాశాంతి హోమం, పూర్ణాహుతి, కళావాహన, పండిత సత్కారం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. మంత్రి సుభాష్‌తో పాటు సర్పంచ్ జల్లి బాలరాజు నాయకులు బొంతు పెదబాబు, వాసంశెట్టి చినబాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, కాండ్రేగుల గోపాలకృష్ణ, అందె వెంకటముక్తేశ్వర రావు నూకపెయ్యి చిన్న, వీరా రవి, బెహర హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.


పుల్లేటికుర్రులో ప్రతిష్ఠించిన అభయ ఆంజనేయస్వామి విగ్రహం

యానాం ఓఎన్జీసీ పరిహారం జీవో విడుదల


సీఎం నుంచి జీవో ప్రతిని అందుకుంటున్న మల్లాడి

యానాం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో ఓఎన్జీసీ చమురు సంస్థ నుంచి రావాల్సిన రెండో విడత నష్టపరిహారం జీవోను పుదుచ్చేరి ప్రభుత్వం విడుదల చేసింది. ఈమేరకు జీవో కాపీలను పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎస్.రంగసామి నుంచి డిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అందుకున్నారు. ఈసందర్భంగా మల్లాడి మాట్లాడారు. పరిహారం విషయంలో ఎంతగానో సహకరించిన ముఖ్యమంత్రి రంగసామి, గవర్నర్ కైలాసనాథ్, మత్స్యకార శాఖ మంత్రి లక్ష్మీనారాయణ, ఇతర అధికారులకు మల్లాడి కృతజ్ఞతలు తెలిపారు. 5,289మందికి రెండో విడతగా తొమ్మిది నెలలకు నెలకు రూ.11500 చొప్పున పెండింగ్‌లో ఉన్న 231మందికి 24నెలలకు పరిహారం విడుదలకు ప్రభుత్వ జీవో విడుదల చేసిందన్నారు. ఈనెల 21న ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా పుదుచ్చేరి గవర్నర్, సీఎం, ఇతర అధికారుల చేతుల మీదుగా పరిహారం ఇచ్చేందుకు అన్నిఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. అదేవిధంగా మూడో విడతగా 5,520మంది లబ్ధిదారులకు ఓఎన్‌జీసీ నుంచి జనవరి 28నుంచి జూలై వరకు 5నెలల14రోజులకు ఒక్కొక్కరికి 63,940 పరిహారం రానుందని, దీనికి సబంధించి పుదుచ్చేరి ప్రభుత్వం నుంచి ఓఎన్‌జీసీకి లేఖ రావడం జరిగిందన్నారు. పరిహారం విడుదలపై ముఖ్యమంత్రి, గరవ్నర్, ఇతర అధికారులకు యానాం అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శేరు కృష్ణ, మల్లాడి శామ్యూల్, మల్లాడి రాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నాలుగున్నరేళ్లుగా ఇబ్బందులు

పి.గన్నవరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీలో 16ఏళ్లుగా 104ద్వారా గ్రామాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్నామని, ప్రభుత్వం ఆధీనంలో ఉన్న మమ్మల్ని వైసీపీ ప్రభుత్వం అరబిందో యాజమాన్యానికి అప్పగించిందని, నాలుగున్నరేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొం టున్నామని 104సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రాలను ఎంపీడీవో కేవీ ప్రసాద్, తహశీల్దార్ కార్యాలయంలో అందించారు. 104 సర్వీసులను గతంలోలా పీహెచ్‌సీలు ద్వారా నిర్వహించాలి, అరబిందో యాజమాన్యం చెల్లించవల్సిన జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందించిన వారిలో డీఈవోలు కె.లలితామాధూరి, ఎస్.మమత, డ్రైవర్లు వి.రమేష్, కె.రామకృష్ణ ఉన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

అంబాజీపేట, నవంబరు 7(ఆంధ్రజోతి): 104 ద్వారా సేవలు అందిస్తున్న సిబ్బందికి పెండింగ్ జీతాలను తక్షణం చెల్లించాలని తహశీల్దారు జె.వెంకటేశ్వరి, ఎంపీడీవో జీవీ సరోవర్‌కు 104 వైద్యసేవల జిల్లా ప్రధాన కార్యదర్శి పితాని త్రిమూర్తులు వినతిపత్రాన్ని అందించారు. గతంలో మాదిరిగానే పీహెచ్‌సీల ద్వారా 104 సేవలు నిర్వహించాలని కోరారు. 2020లో జాయిన్ అయిన ఉద్యోగులకు జీవో నెం.7 ప్రకారం వేతనాలు చెల్లించాలని, మూడేళ్ల నుంచి చెల్లించని ఇంక్రిమెంట్లు ఏరియర్స్ రూపంలో ఇప్పించాలని కోరారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మామిడికుదురు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలంటూ 104 ఉద్యోగులు వినతిపత్రాలను తహశీల్దార్ ఆచార్యులు, ఎంపీడీవో కార్యాలయ పరిపాలనాధికారి కె.వెంకటేశ్వరరావుకు శుక్రవారం అందించారు. మూడు నెలలుగా జీతాలు రావడంలేదని, అందువల్ల కుటుంబం గడవడం కష్టంగా ఉందని వినతిపత్రంలో పేర్కొన్నారు. 104 వైద్య సేవలు ప్రభుత్వ వైద్యుల ద్వారా నిర్వహించడం వల్ల ఖర్చు తగ్గుతుందని, యాజమాన్యం అక్రమంగా వసూలుచేసిన పీఎఫ్ సొమ్ము తిరిగి చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఎం.జగ్జీవన్‌రామ్, సీహెచ్ఎస్వీ సత్యనారాయణ, ఎం.అనంతలక్ష్మి పాల్గొన్నారు.

స్క్రీనింగ్ టెస్ట్ రద్దు

అమలాపురం టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతిభావంతులైన పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల డీఎస్సీ శిక్షణకు అర్హులైన వారిని ఎంపిక చేసే స్క్రీనింగ్ టెస్ట్ రద్దు చేసినట్లు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి తెలిపారు. డీఎస్సీలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉచిత శిక్షణా కార్యక్రమం చేపట్టిందని దీనిలో భాగంగా టెట్ ఉత్తీర్ణులైన వారికి ఈనెల10న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించాల్సి ఉందని అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా స్క్రీనింగ్ టెస్ట్‌ను రద్దు చేశారని, త్వరలోనే ఎప్పుడు నిర్వహించేది తెలియచేస్తామని ఆమె తెలిపారు.

చర్చి వద్దని పంచాయతీని ముట్టడించిన మహిళలు

● కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పాలకవర్గం, ఎంపీటీసీ హామీ ● చర్చి నిర్మాణం చేపట్టవద్దని నోటీసులు ఇస్తామన్న కార్యదర్శి


పంచాయతీని ముట్టడించిన మహిళలు

మలికిపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కత్తిమండ పంచాయతీ పరిధిలో కాలనీలో చర్చి కార్యకలాపాలు కుదరదంటూ శుక్రవారం మహిళలు, హిందూ పరిరక్షణ సమితి సభ్యులు పంచాయతీని ముట్టడించారు. నాలుగు గంటల పాటు అధిక సంఖ్యలో మహిళలు, అయ్యప్పస్వామి భక్తులు, పరిరక్షణ సమితి సభ్యులు జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. పంచాయతీలోకి పలుమార్లు దూసుకువచ్చారు. సంఘటనా స్థలానికి రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్, ఎస్ఐ పి.సురేష్, తహసీల్దార్ టి.శ్రీనివాసరావులతో పాటు అధిక సంఖ్యలో పోలీసు సిబ్బంది పంచాయతీ వద్దకు చేరుకున్నారు. ఆందోళనకారులతో పలుమార్లు చర్చించారు. తక్షణం చర్చి నిర్మాణం నిలుపుదల చేయాలని డిమాండు చేశారు. ఒక దశలో మహిళలు తీవ్ర వ్యాఖ్యలతో పంచాయతీ కార్యవర్గంపై విరుచుకుపడ్డారు. సర్పంచ్ ఆరేటి రంగాను నిలదీశారు. సుదీర్ఘ చర్చల అనంతరం ఈసమస్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామంటూ పంచాయతీ సర్పంచ్ ఆధ్వర్యంలో పాలకవర్గం, ఎంపీటీసీ చిట్టాల శ్రీనులు హామీ ఇచ్చారు. తహశీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇది జిరాయితీ భూమి అని, శాంతిభద్రతల సమస్య ఏర్పడకుండా ఉండడం కోసం తాము చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికిప్పుడే చర్యలంటే కుదరదన్నారు. కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చర్చి కోసం పంచాయతీ ఎటువంటి అనుమతి ఇవ్వలేదని, ఇప్పటికే చర్చి నిర్వాహకునికి నోటీసులు ఇచ్చామని, అక్కడ భవన నిర్మాణం చేపట్టవద్దంటూ నోటీసులు ఇస్తామన్నారు.ఆందోళనలో హిందూ ధర్మపరిరక్షణ సమితి అధ్యక్షుడు చేదులూరి గవరయ్యతో పాటు అడబాల నరసింహారావు, ప్రయాగ నరసింహమూర్తి, బీజేపీ నాయకులు అడబాల రాంబాబు, స్థానికులు ఎం.ఏసుబాబు, ఆరేటి అర్జున్, సీహెచ్ సత్యనారాయణ, కొల్లు ఏడుకొండలు, కె.రఘురామయ్య, కటికిరెడ్డి సావిత్రి, గాలిదేవర ఈశ్వరి, కొడవటి లక్ష్మి పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై కాంగ్రెస్ సబ్‌స్టేషన్ ముట్టడి


ఈదరపల్లిలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన కాంగ్రెస్ నాయకులు

అమలాపురం రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపుదలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ జిల్లా శాఖ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో ఈదరపల్లిలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం ముట్టడించారు. రాష్ట్ర ప్రభుత్వం ట్రూఅప్ చార్జీల పేరిట ఒకేసారి రూ.6,072కోట్ల భారాన్ని సామాన్య ప్రజలపై మోపడంతో యూనిట్ ధర రూ.1.90 నుంచి రూ.2.70కు పెరిగిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచబోమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని చిట్టిబాబు డిమాండు చేశారు. నిరసనలో పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి, పట్టణశాఖ అధ్యక్షుడు వంటెద్దు బాబి, నాయకులు ముషిణి రామకృష్ణారావు, యార్లగడ్డ రవీంద్ర, ఎం.శివన్నారాయణ, కోట శ్రీనివాసరావు, మహబూబ్ షకీలా, ములపర్తి మోహనరావు, దేవరపల్లి రాజేంద్రబాబు, అప్పన శ్రీరామకృష్ణ, రాయుడు వెంకటరమణ, జోగి అర్జునరావు, అయితాబత్తుల కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు: సీఐ

ముమ్మిడివరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన ఏర్పరుచుకుని, ఎవరైనా బ్యాడ్ టచ్‌కు పాల్పడితే అటువంటి వారికి దూరంగా ఉంటూ తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్ సూచించారు. ముమ్మిడివరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ టి.గంగాభవానీ అధ్యక్షతన విద్యార్థినులకు నిర్వహించిన మహిళా సంరక్షణ అవేర్‌నెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈవ్‌టీజింగ్‌పై ఫిర్యాదు చేసినవారి సమాచారాన్ని గోప్యంగా ఉంచి, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడిన వారిని శిక్షిస్తామన్నారు. ఎస్ఐ జ్వాలాసాగర్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

న్యాయసేవా దినోత్సవం

ముమ్మిడివరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా ఆధ్వర్యంలో శుక్రవారం ముమ్మిడివరంలో జాతీయ న్యాయసేవా దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు ఆవరణలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. పేదలకు న్యాయస్థానాలు అందిస్తున్న ఉచిత న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. న్యాయ సేవా దినోత్సవ విశిష్టతను వివరించారు. స్థానిక కోర్టు ప్రాంగణం నుంచి బళ్ల గేటు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, కార్యదర్శి ఆర్.మనేశ్వరరావు, ఏజీపీ తిరుకోటి శాంతిసుధ, న్యాయవాదులు డి.ఆంజనేయులు, గ్రంధి రామారావు, కేఆర్కే రాజు, పి.సుధీర్, కేఎల్వీ ప్రసాదరావు, ఆర్వీఎస్ శాస్త్రి, ఆలీహసన్, ముదే వెంకట్రావు, మట్టపర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీరుస్తా : ఎమ్మెల్యే దేవ


వాటర్ ట్యాంకు నిర్మాణ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే దేవ

అంతర్వేది, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తానని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. వేసవికాలం వచ్చే సరికి మండలంలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూస్తానని చెప్పారు. రామేశ్వరం తాగునీటి కుళాయి ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆయన పలు అభివృద్ధి ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారు. రామేశ్వరం శ్రీరామగురువు తాగునీటి పైపులైను ప్రారంభోత్సవంతో ప్రజలు ఎంతో సంతోషించారన్నారు. అనంతరం కేశవదాసుపాలెం గ్రామంలో దుర్గా సెంటర్, హనుమాన్ సెంటర్లలో ఓఎన్జీసీ, ఈసీ ఫండ్స్‌తో నిర్మించే వాటరు ట్యాంకుకు భూమిపూజ చేశారు. మరో వాటర్ ట్యాంకుకు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం శృంగవరప్పాడులో ఓఎన్జీసీ నిధులతో నిర్మించే వాటర్ ట్యాంకుకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, మండలాధ్యక్షుడు గుబ్బల ఫణికుమార్, ముప్పర్తి నాని, ఉండపల్లి అంజి, ఎంపీపీ వీరా మల్లిబాబు, కూటమి శ్రేణులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

వేదాంత నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆందోళన


ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ఉప్పలగుప్తం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎస్.యానాం గ్రామాభివృద్ధికి రవ్వ యాజమాన్యం గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఇచ్చిన వినతిపత్రాన్ని వేదాంత ప్రతినిధులు తీసుకునేందుకు నిరాకరించడంతో గ్రామస్తులు రవ్వ లివింగ్ క్వార్టర్స్ వద్ద ఆందోళనకు దిగారు. గ్రామంలో ఇచ్చిన హామీ ప్రకారం అభివృద్ధి జరగలేదని, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించలేదంటూ గ్రామస్తులు నినాదాలు చేశారు. వేదాంత కంపెనీ గ్రామ సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాంటు ఉద్యోగులను మధ్యాహ్న భోజనానికి వెళ్లకుండా అడ్డుకున్నారు. అనంతరం వేదాంత ఐఎం, ఏవోలు వచ్చి గ్రామస్తులతో మాట్లాడారు. వినతిపత్రం అందించిన గ్రామస్తులు పది రోజుల్లో సమస్యలను పరిష్కరించకుంటే ప్లాంటు కార్యకలాపాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. సర్పంచ్ జోగి రాజేశ్వరీరాజా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లంకే భీమరాజు, అయితాబత్తుల రాజశేఖర్, రేవు తిరుపతిరావు, పలచోళ్ళ బుజ్జి, మన్నే వెంకటేశ్వరరావు, అయితాబత్తుల అజయ్, ఉండ్రు శామ్యూల్, మేకల నానాజీ, ముత్తాబత్తుల శ్రీను, చీకట్ల శ్రీను, పెట్టా మురళీకృష్ణ, బడుగు వినయ్, అయితాబత్తుల మీరాకుమార్, లంకే నాగు, పినిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

జాతీయ గణిత సదస్సుకు డాక్టర్ మూర్తి



అమలాపురం టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రామానుజన్ జయంతిని పురస్కరించుకుని డిసెంబరు 22న నిర్వహించే జాతీయ గణిత దినోత్సవంలో పరిశోధనా పత్రాల సమర్పణకు అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు, గణితావధాని డాక్టర్ టీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తికి ఆహ్వానం లభించింది. జనవరి మొదటి వారంలో ఆ పత్రాన్ని సమర్పిస్తారు.

'దీపాన్ని' సద్వినియోగం చేసుకోండి

అంబాజీపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతీ ఒక్కరికి దీపం పథకం వర్తిస్తుందని తహశీల్దారు జె.వెంకటేశ్వరి సూచించారు. దీపం పథకంపై లబ్ధిదారులకు అపోహలు ఉన్నాయన్నారు. ఆధార్ ఈకేవైసీ చేయించుకున్న వారికి ఈపథకం వర్తిస్తుందన్నారు. ఈకేవైసీ చేయించుకోని వారు దగ్గరోని గ్యాస్ కంపెనీల వద్ద డెలివరీ బాయ్స్ వద్ద కేవైసీ చేయించుకోవాలన్నారు.

హైస్కూల్‌ను తనిఖీ చేసిన ఆర్డీవో

మామిడికుదురు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు జడ్పీ హైస్కూల్‌ను అమలాపురం ఆర్డీవో కె.మాధవి శుక్రవారం తనిఖీ చేశారు. 9వతరగతి విద్యార్థులకు ఎంత సిలబస్ పూర్తయింది అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనంలో ఇస్తున్న బియ్యం, కోడిగుడ్లను తనిఖీచేశారు. అపార్ కార్డులకు సంబంధించి ఆధార్ నమోదుసెంటర్‌ను పరిశీలించారు. స్కూలులో జరిగే పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. తహశీల్దార్ ఆచార్యులు, ఈవోపీఆర్డీ ఎ.శ్రీనివాసరావు, ఎంఈవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి

అమలాపురం రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మి తెలిపారు. సేంద్రియ ఎరువులను తయారుచేసి విక్రయించాలన్నారు. నడిపూడి పంచాయతీ పరిధిలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును శుక్రవారం ఆమె పరిశీలించారు. వర్మీకంపోస్టు తయారు చేసేందుకు ఉన్న పిట్స్‌లో ఆమె వర్మీ వేసి ప్రారంభించారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు ప్రాంగణంలో ఉన్న చెరువు చుట్టూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆమె చేపట్టారు. వర్మీ కంపోస్టు తయారు చేస్తున్నందున ఆయా ప్రాంతాల్లో ప్రతీ కేంద్రం వద్ద పూలు, పండ్ల మొక్కలు నాటాలని సూచించారు. ఎంపీడీవో ఉండ్రు బాబ్జిరాజు, ఈవోపీఆర్డీ బి.మంగాదేవి, పంచాయతీ కార్యదర్శులు నాగసుబ్బలక్ష్మి, కోడూరి వెంకటేశ్వరరావు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు బట్టేలంక విద్యార్థులు


విద్యార్థులతో ఉపాధ్యాయులు

అమలాపురం టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో జరిగే క్రీడా పోటీలకు మలికిపురం మండలం బట్టేలంక హైస్కూలుకు చెందిన పలువురు విద్యార్థులు ఎంపికైనట్టు హెచ్‌ఎం హనుమంతరావు తెలిపారు. స్కూలుగేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన పోటీల్లో కబడ్డీ, కోకో, వాలీబాల్, రన్నింగ్, లాంగ్‌జంప్, ఫెన్సింగ్ అండర్-17 విభాగాల్లో 64మంది జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో 24మంది రాష్ట్రస్థాయి పోటీల్లో కబడ్డీ 2, లాంగ్‌జంప్ 1, ట్రిపుల్ జంప్ 1, ఫెన్సింగ్ 20మంది రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఫెన్సింగ్‌లో అండర్-14 బాలికల విభాగంలో కె.దేవి, డి.సౌజన్య, ఎ.అశ్విని, అండర్-14 బాలుర విభాగంలో ఎం.అనిల్, అండర్-17 బాలికల విభాగంలో ఎ.మృదులత జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జాతీయ స్థాయి పోటీలు ఈనెల12 నుంచి 16వరకు జమ్ముకశ్మీర్‌లో జరుగుతాయని హెచ్‌ఎం తెలిపారు. క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను హెచ్‌ఎంతో పాటు పీడీ నాగరాజు, విద్యాకమిటీ చైర్మన్ ఎల్.దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

15 వరకు ఎన్‌పీసీఐ యాక్టివేషన్ కోసం శిబిరాలు



అమలాపురం టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి నేరుగా బ్యాంకు ఖాతాలకు చేరేవిధంగా ఈనెల15వ తేదీ వరకు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఇండియా (ఎన్పీసీఐ) యాక్టివేషన్ కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్టు అమలాపురం తపాలా శాఖ సూపరింటెండెంట్ ఆర్.నవీన్‌కుమార్ తెలిపారు. ప్రతీ సచివాలయం పరిధిలో తపాలాశాఖ ఆధ్వర్యంలో ఐపీపీబీ ఖాతాలు తెరవడంతో పాటు ఎన్పీసీఐ యాక్టివేషన్ చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సామాజిక ప్రయోజనాలు పొందేందుకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) లబ్ధిదారుల బ్యాంకు, తపాలా ఖాతాలకు ఎన్‌పీసీఐ లింకును యాక్టివేట్ చేసుకోవాలన్నారు. అమలాపురం డివిజన్ పరిధిలో 1.50లక్షల మంది ఎన్‌పీసీఐ మ్యాపింగ్‌లో ఆధార్ అనుసంధానం కాకపోవడం వల్ల వారికి సంక్షేమ పథకాలు అందే అవకాశాలు లేవన్నారు. తపాలాశాఖలో ఐపీపీబీ ఖాతా ఉంటే వెంటనే ఎన్‌పీసీఐ లింకు చేసుకోవాలని, ఖాతాలేనివారు ఆధార్ నంబరుతో సమీపంలోని తపాలా కార్యాలయంలో ఇండియా పోస్టు పేమెంట్ బ్యాంకు అక్కౌంట్ ఖాతా తెరుచుకుని యాక్టివేట్ చేయించుకోవాలని, ఇందుకోసం ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నవీన్‌కుమార్ కోరారు.

దళారుల ప్రమేయం లేకుండా రైతులకు మేలు

మామిడికుదురు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ వల్ల దళారులు లేకుండా రైతులకు మేలు జరుగుతుందని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ పేర్కొన్నారు. పాశర్లపూడిలో రైతులు ఏర్పాటుచేసిన కంపెనీని శుక్రవారం ఎంపీ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి వారికి అండగా నిలిచేందుకు కంపెనీ ఉంటుందన్నారు. రైతులకు ఉపయోగపడే ఇటువంటి కంపెనీలు మరిన్ని రావాల్సిన ఆవశ్యకత ఎంతగానో ఉందని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, హార్టీకల్చర్ అధికారిణి ఎం.శైలజ, కంపెనీ సభ్యులు వేగి వెంకటేశ్వరరావు, కాశీమళ్ల శ్రీనివాసరావు, సూదా వీరభద్రరావు, బీజేపీ జాతీయ కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్, సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, ఎంపీటీసీ నెల్లి దుర్గాప్రసాద్‌పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన

కాట్రేనికోన, నవంబరు8(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎం.లిఖిత ఆధ్వర్యంలో సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో అందరికీ క్యాన్సర్ పరీక్షలు అనే అంశంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందస్తు పరీక్షలతో వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. గేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో ఎం.శ్రీహరి, ప్రిన్సిపాల్ కె.రవి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎం.నాగరాజు, డాక్టర్ నీలిమ పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం ప్రతీ కార్యకర్త కుటుంబానికి భరోసా

రాజోలు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం ప్రతీ కార్యకర్త కుటుంబానికి ఒక భరోసా వంటిదని రాజోలు నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు అన్నారు. రాజోలు మట్టపర్తివారి కాల్వగట్టు వద్ద మాజీ ఎంపీటీసీ చెల్లింగి జాంబవతి స్వగృహం వద్ద శుక్రవారం జరుగుతున్న టీడీపీ సభ్యత్వ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీడీపీ రాజోలు, మలికిపురం మండలాల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, అడబాల యుగంధర్, టీడీపీ రాజోలు మండల ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, రాజోలు గ్రామశాఖ టీడీపీ ప్రధాన కార్యదర్శి కడలి వెంకటరమణారావు, మామిడిశెట్టి నాగరాజు, బోళ్ల రాజేష్, కడలి అబ్బు, కడలి మోహన్ పాల్గొన్నారు.

వసతిగృహంలో న్యాయ అవగాహన సదస్సు

రాజోలు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాజోలు సమీకృత బాలికల వసతి గృహంలో శుక్రవారం జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల లీగల్ సెల్ కమిటీ చైర్‌పర్సన్ పి.ప్రమీలారాణి బాలిక సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు జి.రజిత, జి.స్టాలిన్, వార్డెన్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ మిత్రాలకు సేఫ్టీ కిట్లు ఇవ్వండి

అల్లవరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని 21వ పంచాయతీల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న క్లాప్ మిత్రాలకు ప్రభుత్వం సరఫరా చేసిన సేఫ్టీ కిట్లను పంపిణీ చేయాలని ఎంపీడీవో టీఎస్ఎస్ కృష్ణమోహన్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈవోపీఆర్డీ యు.నాగేంద్ర, ఏవో బి.లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శులు ఎస్.రాజమోహన్, చిక్కం శ్రీనివాస్, సాయిబాబు, శిరీష, డి.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 18 కలశల పూజ

అంతర్వేది, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీవిజయగణపతి స్వామివారి ఆలయం వద్ద 18 కలశల పూజ శుక్రవారం నిర్వహించారు. పల్లపోతు పూర్ణయ్య గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పలు, గురుస్వాములు, భవానీ భక్తులు శ్రీఅభయాంజనేయ పీఠం ఆధ్వర్యంలో 18 కలశల పూజ నిర్వహించారు. తొలుత స్వాములంతా కలశలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం సాయంత్రం విజయగణపతి ఆలయం వద్ద అయ్యప్పస్వాములంతా కలిసి 18కలశల పూజా కార్యక్రమాన్ని పడి తొక్కి కలశల ఆవాహన చేస్తూ ప్రత్యేక పూజలు చేశారు. పూజ అనంతరం రాత్రి భజనా కాలక్షేపంతో 18 కలశల పూజ వైభవంగా జరిగింది.

సమర్థుడైన యువ నాయకుడు సుభాష్

ముమ్మిడివరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను శుక్రవారం టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ పార్టీ అధికార ప్రతినిధి చెల్లి అశోక్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ముమ్మిడివరం విచ్చేసిన మంత్రి సుభాష్‌కు నగర పంచాయతీ పరిధి పల్లిపాలెం సెంటర్‌లోని చెల్లి అశోక్-శాంతి దంపతులు తమ ఇంటి వద్ద దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. సుభాష్‌కు కార్మికశాఖ మంత్రి పదవి ఇచ్చిన తెలుగుదేశం పార్టీ గౌరవించిందన్నారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుత్తుల సాయి కూడా సుభాష్‌కు శాలువా కప్పి సత్కరించారు. జనసేన నాయకులు రంబాల రమేష్, టీడీపీ బీసీ సెల్ నాయకులు పిల్లి నాగరాజు, గొల్లపల్లి గోపి, కాశి లాజర్, నీతిపూడి వంశీ, గోదశి గణేష్, తొత్తరమూడి జ్యోతిబాబు, మట్టపర్తి రమణ, రాయుడు శేఖర్, కన్నీడి రవికిరణ్, కొండేపూడి సాయి, నల్లా భరత్, కొండేపూడి గౌతమ్, జనిపల్లి రాజేష్, గుత్తుల తులసీ, గుత్తాల రారాజు, పి.నాగరాజు పాల్గొన్నారు.

మధుసూదానంద సరస్వతీ స్వామి పూజలు

అంతర్వేది, నవంబరు8(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి తెలంగాణ రాష్ట్రంలోని సిద్ధిపేట శ్రీక్షేత్రాధిపతి శ్రీశ్రీ మధుసూదానంద సరస్వతీస్వామి శుక్రవారం విచ్చేశారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం నిర్వహించి వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. ఆలయ విశిష్టత, చరిత్రను అర్చకులు ఆయనకు వివరించారు. సహాయ కమిషనర్ సత్యనారాయణ, నల్లా సత్యకిరణ్ కృష్ణప్రసాద్, అన్నదానం స్వామి, శంకరగుప్తం నాని పాల్గొన్నారు.

యానాం చేరుకున్న క్రీడాకారులు

యానాం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న క్రీడాపోటీలకు సంబంధించి పుదుచ్చేరి రాష్ట్రం నుంచి క్రీడాకారులు శుక్రవారం యానాం చేరుకున్నారు. శనివారం, ఆదివారం పుదుచ్చేరి రాష్ట్ర స్థాయి ఆటల పోటీలు స్థానిక జీఎంసీ క్రీడా మైదానంలో నిర్వహిస్తారు. యానాం ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ ప్రవీన్ అధ్యక్షతన జరిగే కార్యక్రమాలకు పుదుచ్చేరి, కారైకాల్, మహే, యానాం నుంచి క్రీడాకారులు 500మంది విద్యార్థులు పాల్గొననున్నారు. వీటిలో బాస్కెట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, క్రీడా పోటీలు నిర్వహిస్తారు. క్రీడా పోటీలను ఆరగ్నైజింగ్ సెక్రటరీ వీవీఎస్ ప్రకాష్, వి.సాన్యసిరావు పర్యవేక్షించనున్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు మండపేట విద్యార్థి

మండపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో ఇటీవల జరిగిన క్రికెట్ పోటీల్లో స్థానిక వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ పాఠశాల విద్యార్థి కంకిపాటి చందుసాయి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి అండర్-14 క్రికెట్ పోటీలకు ఎంపిక య్యాడని పీఈటీ శ్రీనివాసరావు తెలిపారు. అతడిని ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

సమస్యల పరిష్కారానికి ప్రజాపోరు

అమలాపురం టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సీపీఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల15వ రకు సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ప్రజాపోరు నిర్వహిస్తున్నామని జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తిస్తూ ఈనెల14న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు.

రహదారుల మలుపులు యమ డేంజర్

- ప్రమాదాలకు నెలవుగా మలుపులు
- కానరాని హెచ్చరికల బోర్డులు
- స్పీడ్‌బ్రేకర్లు వేయాలంటూ వాహనదారులు వేడుకోలు




ఈతకోట పాత సెంటర్ వద్ద ప్రమాదభరితంగా ఉన్న మలుపు, పొడగట్లపల్లి ప్రధాన రహదారిలో ప్రమాదభరితంగా ఉన్న మలుపు

రావులపాలెం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రహదారులపై వేగంగా ప్రయాణించే వాహనాలు మలుపులు వద్దకు వచ్చేసరికి ముందు వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించకపోవడంతో ఆ మలుపులు నిత్యప్రమాదాలకు నెలవుగా మారాయి. గ్రామీణ ప్రాంత రహదారులతో పాటు ప్రధాన రహదారుల్లో ఉన్న మలుపులు వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, స్లోప్ తక్కువ స్పీడ్ బ్రేకర్లు కూడా లేకపోవడంతో ఆ మలుపులు వద్ద పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడి క్షతగాత్రులు అవుతున్నారు. రావులపాలెం మండలంలోని 12గ్రామాల్లో ప్రధాన రహదారుల వెంబడి ఉన్న మలుపులు ప్రమాద భరితంగా మారాయి. ప్రధానంగా ఈతకోట జాతీయ రహదారి సెంటర్ నుంచి గంటి చెక్ పోస్టు వరకు ఉన్న ప్రధాన రహదారిలో గౌడ రామాలయం వద్ద, పాత సెంటర్ వద్ద, ముమ్మిడివరప్పాడు సెంటర్ వద్ద ప్రమాదకర మలుపులు ఉన్నాయి. లక్ష్మీపోలవరం నుంచి పొడగట్లపల్లి మీదుగా ఇటు రావులపాలెం హైవేకు, ఈతకోట జాతీయ రహదారి వరకు వచ్చే రహదారి పొడవునా పలు ప్రమాదకర మలుపులు ఉన్నాయి. లక్ష్మీపోలవరం సెంటర్ వద్ద ఉన్న మలుపు వద్ద ఇటీవల వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన కూడా జరిగింది. ఈతకోట పాత సెంటర్ నుంచి దేవరపల్లి వెళ్లే ప్రధాన రహదారిలో కేతరాజుపల్లి సెంటర్ వద్ద దేవరపల్లి గ్రామంలో పలు ప్రమాదకర మలుపులు ఉన్నాయి. రావులపాలెం కళా వెంకట్రావు సెంటర్ నుంచి ఊబలంక సెంటర్‌కు వెళ్లే ప్రధాన మార్గంలో పెద్ద ఆంజనేయ స్వామి గుడి సమీపంలో ప్రమాద కర మలుపు ఉంది. ఈప్రమాదకర మలుపులు వద్ద అరకొరగా తప్ప పూర్తిస్థాయిలో ఎక్కడ హెచ్చరిక బోర్డులు స్లోప్‌తక్కువ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతోనిత్యం వాహనదారులు ప్రమాదాల బారిన పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.



లక్ష్మీపోలవరం సెంటర్ వద్ద ప్రమాదభరితంగా ఉన్న మలుపు

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం



రాయవరం మండల ప్రజాపరిషత్‌సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం.

రాయవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాయవరం మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం అధికారులు ఆయా శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించడంతో సమావేశం మొక్కుబడిగా సాగింది. ఉదయం 10:30గంటలకు ఎంపీపీ నౌడు వెంకట రమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ నౌడు వెంకట రమణ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. డ్రైన్‌ల్లో మురుగునీరు పారేవిధంగా వ్యర్థాలు తొలగించాలని, ప్రధాన కూడళ్లలో చెత్త కుప్పలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో కీర్తి స్పందన ఆధ్వర్యంలో వ్యవసాయ, విద్యుత్, ఐసీడీఎస్, వైద్యం, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ తదితర అంశాలపై చర్చించారు. వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల ప్రగతి నివేదికలను సమావేశంలో వివరించారు. నదురుబాద సర్పంచ్ చింతపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలో కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్ బదిలీ కాగా వారిస్థానంలో సిబ్బంది నియామకం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పలువురు ప్రజా ప్రతినిధులు ఆయా గ్రామాల్లో సమస్యలు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండటంతో సమావేశంలో చర్చలతో సమావేశం ముగించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు వి.వెంక భాస్కర్, మండల పరిషత్ ఏవో వైఎస్ఎన్ గోపాల్, ప్రజాప్రతినిధులు వైట్ల సతీష్, వి.వెంకట్రావు, కడలి పద్మావతి, చాట్రాతి జానకి రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.

తాపేశ్వరంలో ఆధార్ నమోదు



తాపేశ్వరం శ్రీచైతన్య పాఠశాలలో ఆధార్ నమోదు దృశ్యం

మండపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తాపేశ్వరం శ్రీచైతన్య పాఠశాలలో శుక్రవారం తాపేశ్వరం సచివాలయ ఉద్యోగులు ఆధార్ కేంద్రాన్ని నిర్వహించారు. ఆధార్ నమోదు, పేరు మార్పులు, చేర్పులకు సంబంధించిన సవరణలు చేస్తున్నారు. తొలిరోజు శుక్రవారం పాఠశాలలో విద్యార్థులు, గ్రామస్తులకు ఆధార్ నమోదు, సవరణలు చేశారని శ్రీచైతన్య ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం కూడా పాఠశాలలో ఆధార్ కేంద్రం సేవలు అందిస్తుందన్నారు.

ఉన్నత పాఠశాలల్లో ఆధార్ శిబిరాలు

కపిలేశ్వరపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వల్లూరు, కపిలేశ్వరపురం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం జీఎస్‌డబ్ల్యుఎస్ సిబ్బంది ఆధార క్యాంపులు నిర్వహించారు. పాఠశాల, జూనియర్ కళాశాలల విద్యార్థులు పుట్టిన తేదీ, పేరు మార్పులు చేసుకోవచ్చన్నారు. విద్యార్థి ఆధార్ మార్పు విషయంలో విద్యార్థి తల్లి లేదా తండ్రి ఉండాలన్నారు. వారి బయోమెట్రిక్ తీసుకోవడం జరుగుతుందన్నారు. త్వరలో మాచర, అంగర ఉన్నత పాఠశాలల్లో క్యాంపులు నిర్వహిస్తామనిఎంఈవో తాతారావు తెలిపారు. వల్లూరు ఆధార్ క్యాంపును ఎంఈవో తాతారావు, కపిలేశ్వరపురంక్యాంపును డీవైఈవో ఫణి పరిశీలించారు.

మహిళలు స్వీయరక్షణలో ధైర్యంగా ముందుండాలి



కొత్తపేట, నవంబరు8(ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో మహిళలు స్వీయరక్షణలో ధైర్యంగా ముందుకు నడవాలని రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ సూచించారు. శుక్రవారం కొత్తపేట డీఎస్పీ గోవిందరావు ఆదేశాలతో స్థానిక సిద్ధార్థ, శతాబ్ది కళాశాలల్లో మహిళా సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ కట్టా నాగమోహన్ అధ్యక్షతన జరిగిన సదస్సులో సీఐ మాట్లాడారు. మహిళల రక్షణకు గ్రామాల్లో ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సదస్సులో ఎస్ఐ జి.సురేంద్ర, ఎవో రెడ్డి సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సూక్ష్మపోషకాలతో అధిక దిగుబడులు



శిక్షణా తరగతుల్లో పాల్గొన్న అధికారులు, సహాయకులు

ద్రాక్షారామ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సూక్ష్మపోషకాలతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా రిసోర్సు సెంటర్ వ్యవసాయాధికారి మనోహర్ అన్నారు. శుక్రవారం రామచంద్రపురం మండలం వెంకటాయపాలెంలో రామచంద్రపురం, కె.గంగవరం మండలాల వ్యవసాయ సహాయకులు, ఉద్యానవన సహాయకులకు డీఆర్‌సీ శిక్షణ తరగతులు నిర్వహించారు. సూక్ష్మపోషకాలు వినియోగం, ప్రయోజనాలు, ఆవశ్యకత గురించి వివరించారు. వ్యవసాయంలో మెళకువలు గురించి తెలిపారు. వ్యవసాయ సాగులో సూక్ష్మపోషకాల వినియోగంతో అధిక పంటల దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి మనోహర్ వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ రంగారావు, వ్యవసాయాధికారులు బి.రవి, సత్యప్రసాద్, వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



కపిలేశ్వరపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మాచరలో 45అడుగుల శ్రీఅభయాంజనేయ స్వామి విగ్రహప్రతిష్ఠ శుక్రవారం ఉదయం కనుల పండువగా జరిగింది. పండితులు పెదపూడి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో పెద్దింటి లక్ష్మణాచార్యులు బ్రహ్మత్వంలో కరెడ్ల శ్రీనివాసు, సత్య దంపతుల యాజమాన్యంలో పలువురు పండితులు ప్రతిష్ఠా యజ్ఞ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. సుధామయ ఆంజనేయస్వామి విగ్రహావిష్కరణ, మహాశాంతి హోమం, మహాపూర్ణాహుతి, కళావాహన, గోదృష్టి, కుంభోదక మార్జన తదితర పూజా కార్యక్రమాలను వేదమంత్రోచ్చారణ నడుమ శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, వివిధ గ్రామాలకు చెందిన భక్తులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవ పూజలు



వి.సావరంలో అభయాంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు.

రాయవరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వి.సావరం-వెదురుపాక రోడ్డులోని తుల్యభాగ కాలువ సమీపంలో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయ 17వ వార్షికోత్సవ పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వెలగల చిన్న భామిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నౌడు వీరబాబు, నౌడు సత్తిబాబు దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. ఆంజనేయస్వామికి అభిషేకాలు, తులసిదళ అర్చన, హోమం పూర్ణాహుతి జరిపారు. కార్యక్రమానికి వెలగల సత్తిరాజు కుమారుడు సత్తిరెడ్డి రూ.50వేలు అందజేశారు. శనివారం 8వేల మందికి అన్నసమారాధన నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. వేదపండితులు గూడిపూడి ప్రభాకర్‌శర్మ, సూర్యచరణ్ శర్మ, కార్తికేయశర్మ, త్రినాధశర్మ, నవుడు త్రిమూర్తులు, వెంకట నాగేశ్వరరావు, కమిటీసభ్యులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి మాస కల్యాణం

ఆత్రేయపురం, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రవణ నక్షత్రం సందర్భంగా స్వామివారి మాసకల్యాణం ఘనంగా నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అశేష భక్తజన గోవిందనామస్మరణల నడుమ స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా ఏకాదశ రుద్రాభిషేకం

కపిలేశ్వరపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వల్లూరులో కొలువైయున్న పార్వతీ అగస్తేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం వైభవంగా జరిగింది. శ్రీకంఠం మల్లేశ్వరశర్మ అర్చకత్వంలో పలువురు పండితులు స్వామివార్కి ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవార్కి కుంకుమ పూజలు, నందీశ్వరునికి అభిషేకం, రుద్రహోమం తదితర పూజా కార్యక్రమాలను వేదమంత్రోచ్చారణ నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈనెల 13న ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పోలింగ్ అసిస్టెంట్లకు శిక్షణ

కపిలేశ్వరపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాలేరు ఉపఎన్నికకు సంబంధించి శుక్రవారం ఎన్నికల అధికారి, తహసీల్దార్ చిన్నారావు పోలింగ్ అధికార్లు, పోలింగ్ అసిస్టెంట్లకు శిక్షణ నిర్వహించారు. కాలేరులో నిర్వహించిన శిక్షణలో ఆయన ఎన్నికల నియమావళి, పాటించాల్సిన పద్ధతులు, ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై వివరించారు. ఎన్నికలు సజావుగా జరిగేలా పోలింగ్ అధికారులు, అసిస్టెంట్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. శిక్షణలో ఏఈహెచ్‌డబ్ల్యు, డీవో డబ్ల్యు ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

కేదార్లంకలో 104 వైద్య సేవలు

కపిలేశ్వరపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కేదార్లంక పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం 104 వైద్య సేవలు నిర్వహించారు. వానపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యాధికారిణి డా.ఎస్ నిహారిక షుగర్, బిపి, తదితర వ్యాధులకు సంబంధించి రోగులకు పరీక్షలు చేశారు. ఉచితంగా మందులను అందజేసారు. ఏఎన్ఎం పళ్ళాలమ్మ, ఆశావర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల తాగునీటి తొట్టె ప్రారంభం



రాయవరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): లొల్లలో గ్రామానికి చెందిన మేకా పద్దరాజు కుమారుడు మేకా రామలక్ష్మణ కుమార్ ఆర్థిక సహాయంతో నిర్మించిన పశువుల నీటి తొట్టెను శుక్రవారం ప్రారంభించారు. సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు, ఎంపీటీసీ వైట్ల సతీష్, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు సుంకవిల్లి గంగరాజు, జనసేన నేత వెలంపాలేపు సోమశేఖర్, గంటా సతీష్, మేకా సుబ్బారావు, చాట్రాతి జానకి రామారావు, ముప్పాటి కృష్ణ, చాట్రాతి సూర్యచంద్ర భాస్కరరావు, ముళ్లపూడి గంగాధర్ రామారావు, నాయకులు పాల్గొన్నారు.

జెండా కట్టుకుని తిరిగిన కార్యకర్తకు సైకిల్ బహూకరణ



రమణకు సైకిల్ అందజేస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం (ద్రాక్షారామ), నవంబరు8 (ఆంధ్రజ్యోతి):తెలుగుదేశం జెండా సైకిల్‌కు కట్టుకుని తిరిగిన కార్యకర్తకు గురువారం మంత్రి సుభాష్ కొత్త సైకిల్ బహూకరించారు. ముచ్చుమిల్లి గ్రామానికి చెందిన గంజా రమణ తన సైకిల్‌కు పెద్దజెండా కట్టుకుని రామచంద్రపురం పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేస్తుంటాడు. గడచిన సార్వత్రిక ఎన్నికల్లో రమణ ఎన్నికల ప్రచారం చేశారు. మంత్రి సుభాష్ నూతన సైకిల్ కొనుగోలుచేసి రమణకు అందజేశారు.

20న మాలల కార్తీక వనసమారాధన

ద్రాక్షారామ, నవంబరు8(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గ మాలల కార్తీక వనసమారాధన ఈనెల 20న ఉదయం 11గంటల నుంచి ద్రాక్షారామ వ్యవసాయ మార్కెట్‌యార్డులో నిర్వహిస్తున్నట్లు జైబీమ్ దళిత సేవా సంఘం అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం మాలల కార్తీకవనసమారాధన కరపత్రాలు గురువారం మాల నాయకులు ఆవిష్కరించారు. కార్తీకవనసమారాధనకు అధిక సంఖ్యలో మాలసామాజిక వర్గీయులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామిని దర్శించుకున్న మంత్రి సుభాష్

రాయవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవక్షేత్రంగా పేరుగాంచిన సోమేశ్వరం శ్రీబాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మంత్రి వాసంశెట్టి సుభాష్ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ మంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. సోమేశ్వరస్వామి రుద్రాభిషేకం, అమ్మవారికి జరిగిన అర్చనలో పాల్గొన్న మంత్రికి అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వేద ఆశీర్వచనం అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఈవో గంధం సత్యనారాయణ, గరగ వెంకటేశ్వరరావు, సోమన్న పాల్గొన్నారు.



సోమేశ్వరాలయంలో పూజలు చేస్తున్న మంత్రి సుభాష్

సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు

- ఆలమూరు డీసీ పరిధిలో నాలుగు సంఘాలకు ఎన్నికలు
- ఓటర్ల జాబితా సిద్ధం చేసిన సిబ్బంది
- 21నుంచి 23లోపు ఎన్నికల షెడ్యూల్

ఆలమూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రయోజనం చేకూరేందుకు రైతుల నుంచి ప్రతినిధులను ఎన్నుకుని సాగునీటి సంఘాలు ఏర్పాటు ప్రక్రియలో భాగంగా ఆలమూరు నీటిపారుదల కార్యాలయం పరిధిలో ఉన్న డిస్ట్రిబ్యూటరీ కమిటీలో నాలుగుసాగునీటి సంఘాలు ఉన్నాయి. నాలుగు సాగునీటి సంఘాలు, డీసీ ఎన్నికలు ఈనెల 21నుంచి 23లోపు నిర్వహించేందుకు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. దీనిలో భాగం ఓటర్ల జాబితాలను రెవెన్యూ సిబ్బంది సిద్ధం చేస్తున్నారు. తుది జాబితా ఈనెల 10న విడుదల చేయనున్నారు. ఆలమూరు డీసీ పరిధిలో మడికి, చొప్పెల్ల, ఆలమూరు, చింతలూరు సాగునీటి సంఘాలు ఉన్నాయి. వీటికి ఎన్నికలు నిర్వహించడంతోపాటు ఈ కమిటీలకు అధ్యక్షులుగా ఎన్నికైన వారి నుంచి ఒకరిని డీసీ అధ్యక్షుడిగా ఎన్నుకుంటారు. ఆలమూరు సాగునీటి సంఘం పరిధిలో ఆలమూరు, చింతలూరు, తాతపూడి, అంగర గ్రామాలకు చెందిన రైతులు ఓటర్లుగా ఉన్నారు.మడికి సాగునీటి సంఘం పరిధిలో మడికి, పొట్టిలంక, చెముడులంక, చొప్పెల్ల సాగునీటి సంఘం పరిధిలో చొప్పెల్ల, నవాబుపేట, పేనికేరు, నర్సిపూడి గ్రామాలు, చింతలూరు నీటిసంఘం పరిధిలో చింతలూరు, పెదపళ్ల, పినపళ్ల, సంధిపూడి, వెదురుమూడి గ్రామాల రైతులకు ఓటుహక్కు ఉంది. ఈమేరకు రెవెన్యూ సిబ్బంది ఓటర్ల జాబితాలను రూపొందించారు. ఈనెల పదిన జాబితా విడుదలచేసి అభ్యంతరాలు ఉంటే తెలుపుకోవాల్సి ఉంటుంది.



ఆలమూరు నీటిపారుదల శాఖ కార్యాలయం

అధ్యక్ష పీఠం కోసం కూటమి నాయకుల కసరత్తు

సాగునీటి సంఘాల ఎన్నికలలో అధ్యక్ష పీఠం దక్కించుకోవడానికి కూటమిలో ఉన్న తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు సిద్ధమవుతున్నారు. ఓటర్ల జాబితాలో తెలుగుదేశం, జనసేన నాయకులకే ఎక్కువ అవకాశాలు ఉండటంతో వాటిని సాధించుకోవడానికి ఇప్పటికే ఆయా పార్టీల నాయకులను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

ఆలమూరు కోర్టు ఏజీపీగా ప్రసన్న బాధ్యతల స్వీకరణ



ఏజీపీగా బాధ్యతలు స్వీకరించిన విద్యాప్రసన్న

ఆలమూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆలమూరు జూనియర్ సివిల్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ పీడర్‌గా బూసి విద్యాప్రసన్న శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కోర్టు ఏజీపీగా నియమిస్తూ ఏపీ సెక్రటరీ టూ గవర్నమెంట్ వి.సునీత ఉత్తర్వులు జారీ చేయడంతో ఈమేరకు విద్యాప్రసన్న బాధ్యతలు స్వీకరించారు. విద్యాప్రసన్నను పలువురు న్యాయవాదులు, నాయకులు అభినందించారు.

రామచంద్రపురం డీఎస్పీ బదిలీ

రామచంద్రపురం(ద్రాక్షారామ),నవంబరు 8(ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ బదిలీ అయ్యారు. గురువారం జరిగిన డీఎస్పీ బదిలీల్లో భాగంగా రామచంద్రపురం డీఎస్పీగా పనిచేస్తున్న బి.రామకృష్ణను రాజమహేంద్రవరం స్పెషల్ బ్రాంచి డీఎస్పీగా బదిలీ చేశారు. రామచంద్రపురం డీఎస్పీగా ఎవరినీ నియమించలేదు.

సౌత్‌జోన్ బ్యాడ్మింటన్ పోటీలకు మండపేట విద్యార్థిని ఎంపిక

మండపేట, నవంబరు8(ఆంధ్రజ్యోతి): మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న డిగ్రీ విద్యార్థిని నక్కిన యమునా పద్మావతి, కర్ణాటకలో జరిగే సౌత్‌జోన్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైందని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. ఈమేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల పాలకొల్లు డీఎన్ఆర్ కళాశాలలో జరిగిన ఆదికవి నన్నయ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల బ్యాడ్మింటన్ పోటీల్లో నన్నయ యూనివర్సిటీ తరపున ఎంపికైంద న్నారు. ఈ విద్యార్థిని త్వరలో కర్ణాటకలోని విశ్వేశ్వరాయ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలో ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ తరపున పాల్గొంటుందని ఆయన తెలిపారు. ఈమేర కు విద్యార్థిని యమునా పద్మావతిని పీడీ సున్న వీరాంజనేయులు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్, అభినయ్ ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.



బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని పద్మావతి

ఘనంగా అయ్యప్పస్వాముల పడిపూజ




ఆత్రేయపురం, మడికిలో అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహిస్తున్న స్వాములు

ఆత్రేయపురం,నవంబరు8(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో అయ్యప్పమాల ధరించిన దీక్షాదారులు పడిపూజ మహోత్సవంతో సందడి చేస్తున్నారు. మాలధరించి నిష్ఠాగరిష్ఠులై దీక్ష చేస్తున్న స్వాములు ఇళ్ల వద్ద భక్తిశ్రద్ధలతో పడిపూజలు చేస్తున్నారు. అయ్యప్పగానామృతం శరణుఘోషతో గ్రామాలు భక్తపారవశ్యంతో మునిగితేలుతున్నాయి. ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామంలో కల్లూరి శ్రీను గురుస్వామి పీఠం ఆధ్వర్యంలో కల్లూరి శివస్వామి భజన బృందం అయ్యప్పగానామృతం భక్తులను ఆకట్టుకుంది. ఆత్రేయపురం గంగరాజు గురుస్వామి ఆధ్వర్యంలో అగ్రహారంలో కేలా రాంబాబు స్వామి ఇంటివద్ద పడిపూజ నిర్వహించారు. నదీజలాలను ఊరేగింపుగా తీసుకువచ్చి 54కళశాల పూజనిర్వహించారు.

ఆలమూరు: ఆలమూరు మండలం మడికిలో గురువారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమం వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన నార్కిడిమిల్లి నారాయణమూర్తిస్వామి తన ఇంట ఏర్పాటు చేసిన ఈపూజా కార్యక్రమాలను చొప్పెల్లకు చెందిన శివాలయ అర్చకులు రాజశేఖర్‌శర్మ అధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అరటిడొప్పలతో తయారు చేసిన వేదిక విశేషంగా ఆకట్టుకుంది. దూలం శ్రీనివాస్‌గురుస్వామి, బొనం లక్ష్మణ్‌గురుస్వామి, గారపాటి శివన్నారాయణగురుస్వామి పూజలో పాల్గొన్నారు.

కొత్తపేట బాలికోన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ



కొత్తపేట పాఠశాలలో గుడ్లు, భోజనాలు పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీకర్

కొత్తపేట, నవంబరు8(ఆంధ్రజ్యోతి): కొత్తపేట జడ్పీ బాలికోన్నత పాఠశాలను శుక్రవారం ఆర్డీవో శ్రీకర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆపార్ డేటా సెంటర్‌ను విజిట్‌చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి సిలబస్‌ను ఎంత వరకు పూర్తిచేశారో తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకంలో వినియోగిస్తున్న బియ్యాన్ని, విద్యార్థులకు అందిస్తున్న గుడ్లను పరిశీలించారు. నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని ఏజెన్సీ సూచించారు. తహశీల్దారు రాంబాబు, ఎంఈవో హరిప్రసాద్, ఆర్ఐ రవిశంకర్, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పని ఒత్తిడిని తగ్గించాలని ఏఎన్‌ఎంల వినతి



ఆలమూరులో ఎంపీడీవోకి ఏఎన్ఎంలు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఆలమూరు, నవంబరు 8(ఆంధ్యజ్యోతి): గ్రామసచివాలయాలలో పనిచేస్తున్న ఎఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆలమూరు మండల ఎఎన్ఎంలు శుక్రవారం ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజుకు వినతిపత్రం అందించారు. వైద్యఆరోగ్య శాఖలోని విధులతోపాటు ఏకకాలంలో గ్రామసచివాలయంలో విధులను నిర్వహించాలని అధికారుల నుంచి వత్తిడి ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ విధులను కేవలం వైద్యఆరోగ్య విధులను నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. మీ సమస్యలను ఉన్నతాధికారులకు వివరించి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని ఎంపీడీవో రాజు హామీఇచ్చారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న 104 ఉద్యోగులు

ద్రాక్షారామ, నవంబరు8(ఆంధ్రజ్యోతి):104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఉద్యోగుల సంఘం నాయకులు ఎంపీడీవో కె.పద్మజ్యోతి, తహసీల్దార్ మాధురిలకు వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను కోనసీమ జిల్లా యూనియన్ అధ్యక్షుడు పలివెల చంద్రశేఖర్, కె.శ్రీనివాసరావులు అందజేశారు.

‘ఫోర్టిఫైడ్ రైస్‌లో ఎన్నో పోషకాలు’

కొత్తపేట, నవంబరు8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యంలో ఎన్నో పోషకాలు ఉన్నాయని వాటిని లబ్ధిదారులు వినియోగించుకోవాలిగాని అమ్ముకోకూడదంటూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ గరీబ్ కళ్యాణ యోజన పథకం కింద ఉచిత రేషన్ బియ్యాన్ని అందిస్తున్నారని ఆ బియ్యం ఫోర్టిఫైడ్ రకమని దానిలో జింక్, విటమిన్ ఏ, బీ 6, బీ 12 పోషకాలు కలిపి ప్రోసస్ చేసిన బియ్యం వాటిని వినియోగిస్తే రక్తహీనత దరిచేరదని రోగ నిరోధక శక్తి పెరుగుతుందని వీటిని కొందరూ తెలియక ప్లాస్టిక్ బియ్యం వస్తున్నాయని అపోహతో బయటమార్కెట్‌లో విక్రయిస్తున్నారని వాపోయారు. ప్రతిఒక్కరూ రేషన్ బియ్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.